J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 14
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 37 18.2.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## పిఎస్ఎల్వి-సి52 సక్సెస్



గురి తప్పని **రామబాణం**

(వివరాలు 5వ పేజీలో)

## కొత్త పోలీస్ బాస్‌గా కసిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి



3 లో



6,7 లో

## ఆత్మీయ ఆనంద వేడుకగా మన వెంకయ్య మనుమరాలి పెళ్లి

## అంతర్జాతీయ క్రికెట్‌లో నెల్లూరు కుర్రోడు



12 లో

## మార్పు మొదలయ్యింది

- ఏపిలో ప్రవీణ్‌ప్రకాష్ సేవలకి సెలవు
- ఏపిపిఎస్‌సి ఛైర్మెన్‌గా సవాంగ్‌కి నెలవు
- త్వరలోనే కొత్త మంత్రుల కొలువు

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి మరో మూడు నెలలకు మూడేళ్ళు పూర్తైపోతుంది. ఈ 33 నెలల కాలంలో సంక్షేమ పథకాల పేరుతో లక్షల కోట్ల రూపాయలు ప్రజల బ్యాంకు ఖాతాలలోకి నేరుగా జమ చేసింది జగన్ ప్రభుత్వం. ముందస్తు ఎన్నికలకు వెళ్ళని పక్షంలో కనీసం మరో రెండేళ్ళు ఇదే పద్ధతిని కొనసాగించక తప్పదు.

3 లో

## తూచ్..! హోదా లేదు.. గీదా లేదు

- తెరపై వివేకానందరెడ్డి హత్య కేసు
- ఛార్జిషీట్‌లో అవినాష్‌రెడ్డికి ప్లేసు
- తెరమరుగైన ప్రత్యేకహోదా ఊసు

నరేంద్ర మోడీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రాపై చూపుతున్న సవతి ప్రేమ మరోసారి తేటతెల్లమైపోయింది. మొన్నటి బడ్జెట్లో కనీసం ఎంగిలి చేయి కూడా విదల్చలేదని ఒకవైపు తెలుగు గుండెలు మండుతుంటే, ఇప్పుడు ప్రత్యేకహోదా విషయంలో దాగుడుమూతలు ఆడుతూ తన కుటిల బుద్ధిని మళ్ళీ ప్రదర్శించింది కేంద్రం.

10 లో







## విఎస్‌యులో ఉద్యోగ మేళా

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)లో ఈనెల 16న ఉద్యోగ మేళా నిర్వహించారు. రిలయన్స్ నిప్పాన్, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, భారత్ ఎఫ్‌ఐహెచ్ సంస్థలు ఉద్యోగావకాశాలు కల్పించాయి. విఎస్‌యులోని సర్ సివి రామన్ సెమినార్‌హాలులో ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, విద్యారంగంలో తమ ప్రతిభను, నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. ఎంపికైనవారికి ఆమె చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఎంపికైన విద్యార్థులను విఎస్‌యు రెక్టార్ ఆచార్య ఎం.చంద్రయ్య, రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజా ఎస్ నాయర్‌లు అభినందించారు. ఈ ఇంటర్వ్యూలకు 93 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 43 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోఆర్డినేటర్ డా.సిహెచ్ విజయ, ప్లేస్‌మెంట్ అధికారి డా.పి.చెంచురెడ్డి తెలిపారు. డిస్ట్రిక్ట్ మేనేజర్ అబ్దుల్ ఖయ్యూం, నారాయణ, సెట్నెల్ ఇన్‌చార్జి సిఇఓ జనార్దన్, ఉమాసుమాలిని, హరికృష్ణ, శ్రీనివాస్, ఏపిఎస్ఎస్‌డిసి సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాంపస్‌లో.. స్వచ్ఛభారత్



జాతీయ సేవా పథకం మరియు హాస్టల్ వార్డెన్లు ఇటీవల నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి పాల్గొని శ్రమదానం చేశారు. పినాకిని బాలుర వసతి గృహం, స్వర్ణముఖి బాలికల వసతి గృహాల ప్రాంగణంలోను, పరిసరప్రాంతాలలోనూ శ్రమదానం చేసి చెత్తను శుభ్రపరచారు. అందరూ బాధ్యతతో విఎస్‌యు క్యాంపస్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. క్యాంపస్ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్ డెప్యూటీ వార్డెన్లు డా.ఆర్ ప్రభాకర్, డా.వై.విజయ, డా.శ్రీకన్యరావు, అధ్యాపకేతర సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు

## మునిసిపల్ కార్మికుల ధర్నాందోళన




ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ మునిసిపల్ కార్మికులు నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఈనెల 15న ధర్నాందోళన చేశారు. ఏయుటిసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామరాజు, దామా అంకయ్యల ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మనెంట్ చేయాలని, 11వ పిఆర్‌సిలో ఫిట్‌మెంట్ పెంచాలని, హెచ్ఆర్‌పి శ్లాబ్‌లను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు కార్మికులకు అండగా ఉద్యమిస్తామన్నారు. ఏఐటియుసి గౌరవాధ్యక్షులు ఆంజనేయులు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, బాలాజీ, నరేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరును నెల్లూరు జిల్లాలోనే ఉంచాలి

• 'స్పందన'లో కలెక్టర్‌కు వినతి

నెల్లూరుకు కేవలం 40 కిలో మీటర్ల దూరంలో ఉన్న గూడూరును బాలాజీ జిల్లాలో కలపడం వల్ల గూడూరు ప్రాంత ప్రజలకు ఎంతో ఇబ్బందిగా ఉంటుందని, అందువల్ల ప్రజల ప్రయోజనం దృష్ట్యా గూడూరును నెల్లూరుజిల్లాలోనే ఉంచాలని ప్రజాభిప్రాయ సాధన సమితి ప్రతినిధులు ఈనెల 14న నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన 'స్పందన' కార్యక్రమంలో కలెక్టర్‌కు విన్నవించారు. పరిపాలనా సౌలభ్యం కోసమే జిల్లాల పునర్విభజన అంటున్న ప్రభుత్వం నెల్లూరుకు దగ్గరలో ఉన్న గూడూరును దూరంగా ఉన్న తిరుపతిలో కలపడం సముచితం కాదని వారు పేర్కొన్నారు. అలా వీలు కానప్పుడు గూడూరును జిల్లాగా ప్రకటించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# నెల్లూరు కబుర్లు

### రోలర్ స్కేటింగ్‌లో 48 పతకాలు సాధించి
## సత్తా చాటుకున్న నెల్లూరు క్రీడాకారులు



గుంటూరులో ఇటీవల జరిగిన రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరు చిన్నారులైన క్రీడాకారులు తమ సత్తా చాటుకున్నారు. భారీస్థాయిలో 30 స్వర్ణపతకాలు, 18 రజత పతకాలు సాధించి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. శాప్ జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులందరినీ ఈనెల 15న నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్కులో ఉన్న స్కేటింగ్ రింక్ వద్ద జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ యతిరాజ్ అభినందించారు. జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధి కందుకూరి రమేష్, కోచ్‌లు జితేంద్ర, జావీద్, షౌకత్, విశ్వనాథ్, సుజాత, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్ట్‌లో దివ్య ప్రతిభ

- అభినందించిన కలెక్టర్



అవస్మా జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన ఎంఎంటిఎస్ఇ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానాన్ని సాధించిన నెల్లూరులోని సాయి మహావిద్యాలయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని దివ్యను జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఈనెల15న అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆ బాలికకు సూచించారు. ఆ పాఠశాల కరెస్పాండెంట్ నారాయణ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునికి డాక్టరేట్



నెల్లూరులోని కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో జడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న చేమూరు మస్తాన్‌కు రసాయనశాస్త్రంలో డాక్టరేట్ లభించింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి పర్యవేక్షణలో 'సాయిల్ క్వాలిటీ ఎవాల్యుయేషన్ ఫర్ హెవీ మెటల్స్ ఇన్ కోస్టల్ రీజియన్ ఆఫ్ నెల్లూరు-ఏపీ' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించింది.

## అస్సాం సిఎంను బర్తరఫ్ చేయాలి

- డిసిసి అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి



అఖిలభారత కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అస్సాం ముఖ్యమంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఇటీవల ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బిజెపి నాయకులు, అస్సాం సిఎం హిమంత బిస్వాశర్మ వంటివారు కాంగ్రెస్ నాయకులపై లేనిపోని విమర్శలు చేయడం, అసభ్యకరమైన పదజాలంతో దూషించడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. అస్సాం సిఎంను బర్తరఫ్ చేసి మోడీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. పదవుల కోసం, రాజకీయ లబ్ధికోసం ఇతరుల కుటుంబాలను రచ్చకీడ్చడం సబబు కాదని, స్త్రీలను కించపరిచేవిధంగా వ్యాఖ్యలు చేస్తే ఎంతటిస్థాయి వ్యక్తులైనా సరే, వారిపై కఠినచర్యలు తీసుకునేవిధంగా చట్టాలు రూపొందించాలని ఆయన ఈ సందర్భంగా ప్రధానిని కోరారు. అస్సాం సిఎం వెంటనే రాహుల్‌గాంధీకి క్షమాపణలు చెప్పాలని, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### మూలస్థానేశ్వరస్వామి
## బ్రహ్మోత్సవాలు 24 నుంచి


ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న మంత్రి అనిల్

నెల్లూరు మూలాపేటలో వెలసివున్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఈ నెల 24 నుంచి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. మార్చి 8వ తేదీ దాకా నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఉత్సవ ఆహ్వానపత్రికలను ఇటీవల మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ తదితర అధికారులతో కలిసి సమావేశమయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, సుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, విజయా డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆలయ ధర్మకర్తలు, దేవాదాయశాఖ సహాయకమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇఓ వేణుగోపాల్, కార్పొరేటర్ నాగమణి, జంగం కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకళాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో
## విద్యార్థినులకు పోటీలు



స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో నెల్లూరులోని శ్రీ కళాలయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ ప్రెజెంటేషన్‌లలో ఈనెల 16న నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాలలో పోటీలు నిర్వహించారు. మహాత్మాగాంధీజీ అహింసా సిద్ధాంతం, స్వాతంత్ర్యసమరంలో మహిళల పాత్ర అనే అంశాలపై జరిగిన ఈ పోటీల్లో 75 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లభాషల్లో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు గాంధీజీ, స్వాతంత్ర్యోద్యమం, ప్రముఖ స్వాతంత్ర్యసమర యోధురాలు పొణకా కనకమ్మల జీవితచరిత్ర పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. కళాశాల చరిత్ర విభాగాధిపతి ఫాతిమాబేగం చొరవతో జరిగిన ఈ పోటీలను శ్రీకళాలయ ట్రస్ట్ నిర్వాహకురాలు గూడూరు లక్ష్మి పర్యవేక్షించారు. కాలేజీ విశ్రాంత చరిత్ర అధ్యాపకురాలు సునీత, అధ్యాపకులు కె.శ్రవణ్‌కుమార్, జె.కృష్ణప్రసాద్, శ్రీమంతుల హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## దంత వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వద్దు

- డాక్టర్ కన్నన్



దంత వ్యాధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా ఉండకూడదని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుని అవసరమైనవారు తగు చికిత్సలు చేసుకుంటుండాలని నెల్లూరులోని నారాయణ దంత వైద్యకళాశాల హెచ్ఓడీ డాక్టర్ ఎన్ కన్నన్ అన్నారు. ఇటీవల నగరంలోని కొండాయపాళెం చర్చిలో జరిగిన దంత వైద్య అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత దంత వ్యాధుల పట్ల అవగాహనతో ఉండాలన్నారు. దంత వైద్యుణ్ణి సంవత్సరానికోసారి సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చర్చి ఫాదర్ డాక్టర్ నిర్మల్‌కుమార్ ఈ సందర్భంగా చిన్నారులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘసేవకురాలు నూర్జహాన్ బేగం, డాక్టర్ శ్రీకాంత్, కోటిరెడ్డి, డాక్టర్‌లు హిమబిందు, కృపాకర్, రవళి, వైష్ణవిలతో పాటు నెరసం అధ్యక్షుడు జయప్రకాశ్, మోటివేటర్ గీతా చక్రవర్తి పాల్గొన్నారు.

## కొత్త పోలీస్ బాస్‌గా
# కసిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి



కొత్త పోలీసు బాసుగా నెల్లూరుజిల్లాకు సుపరిచితులైన కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డిని రాష్ట్రప్రభుత్వం నియమించింది. రాష్ట్ర డీజీపీగా కొనసాగుతుండిన గౌతమ్ సవాంగ్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మెన్‌గా నియమించి, ఆయన స్థానంలో ఇంటెలిజెన్సు డీజీగా ఉన్న రాజేంద్రనాథ్‌రెడ్డికి డీజీపీగా అదనపు బాధ్యతలు అప్పజెప్పింది. పూర్తిస్థాయి డీజీపీగా కూడా ఆయన పేరును సూచిస్తూ ప్రతిపాదనలు కేంద్రానికి పంపింది.

### రాజేంద్రుని టైంలోనే రాజన్న రాజ్యం...

2002 ఏప్రిల్ నుండి 2004 జూన్ వరకు రాజేంద్రనాథ్‌రెడ్డి నెల్లూరుజిల్లా ఎస్పీగా పనిచేశారు. వ్యక్తిగా ఎంతటి సౌమ్యుడో అధికారిగా అంత కఠినంగా వ్యవహరించేవారు. అసాంఘిక శక్తుల గుండెలలో రైళ్లు పరిగెత్తించేవారు. ఆయన పనిచేసిన టైంలో జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందంటే అది ఆయన ప్రతిభే. ఆయన జిల్లా ఎస్పీగా ఉన్న సమయంలోనే సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పటికి 9 సంవత్సరాలుగా గ్రహణం పట్టివున్న రాష్ట్రం దివంగత మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి చేతికి వచ్చి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో రాజన్న రాజ్యం ఏర్పడింది.

### ‘లాయర్’తో ఆత్మీయ అనుబంధం...

జిల్లాలో పనిచేసే సమయంలో ఆయనతో ‘లాయర్’కి స్నేహపూర్వక సంబంధాలుండేవి. 2003 జూన్ 15న తెలుగు సినీరంగానికి చెందిన హాస్యనటులను, ప్రముఖ హీరో యిన్లను నెల్లూరుకు రప్పించి ‘న భూతో న భవిష్యత్’ అన్న తరహాలో ‘లాయర్’ పత్రిక నిర్వహించిన మెగా స్టార్‌నైట్ ‘నవ్వుల పండుగ’లో రాజేంద్రనాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆ రోజుల లోనే 15 వేలమంది ఆహుతులతో జరిగిన అతి భారీ కార్యక్రమం విజయవంతం కావడానికి రాజేంద్రనాథ్‌రెడ్డి అందించిన సహకారం ‘లాయర్’ ఎన్నటికీ మరువదు. త్వరలోనే కేంద్రం ఆదేశాలతో ఆయన పూర్తిస్థాయి డీజీపీగా భాద్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ అభినందనలు అందిస్తోంది ‘లాయర్’.




‘నవ్వుల పండుగ’ కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.రాజేంద్రనాథ్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే జె.కె.రెడ్డి

## అబ్బా!...
# సర్వేపల్లి నెల్లూరులోనేనా?
## బాధపడుతున్న ఓ యువ వైసీపీ నేత...!

జిల్లాల పునర్విభజనలో భాగంగా తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలోని వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరులతో పాటు సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కూడా కొత్తగా ఏర్పడబోయే ‘శ్రీ బాలాజీ’ జిల్లాలో కలవబోతోందని తొలుత వార్తలొచ్చాయి. సర్వేపల్లిని కూడా నెల్లూరుజిల్లా నుండి తీసేసి పక్కజిల్లాలో కలిపితే ఇక జిల్లా ఆర్థికంగా, ప్రగతి పరంగా అనాథగా మారి సర్వనాశనమైపోతుందన్న అభిప్రాయం సర్వత్రా వినిపించింది. సేవాభూషణ్ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చొరవో, కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రయత్నమో, ప్రజల విజ్ఞప్తి పుణ్యమో లేక శ్రీవారినీ, అమ్మవారినీ ఒకే జిల్లాలో ఉంచడంలో భాగంగా తిరుచానూరు కోసం చంద్రగిరి నియోజకవర్గాన్ని శ్రీ బాలాజీ పరిధిలోకి తెచ్చిన ఫలితమో... మొత్తానికి ముఖ్యమంత్రి దయదలచి సర్వేపల్లిని నెల్లూరులోనే ఉంచేశారు. ఈ నిర్ణయం అటు సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలని, ఇటు మిగులుజిల్లాలోని ఇతర ప్రాంత వాసులని సంతోషపరచింది. గుడ్డిలో మెల్లలా కనీసం సర్వేపల్లినైనా మిగిల్చారని సంతృప్తి చెందారు. భౌగోళికంగా చూసినా సర్వేపల్లి నెల్లూరుజిల్లాలో ఉండడమే సబబు. దేశంలోనే ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చెందుతున్న ‘అదానీ కృష్ణపట్నం ఓడరేవు’తో పాటు దానికి అనుసంధానంగా రానున్న పారిశ్రామికవాడలు కూడా నెల్లూరుజిల్లాలో ఉండిపోతాయన్నది అందరి ఆకాంక్ష, ఆనందం.

అయితే జిల్లాకు చెందిన ఒక యువ వైసీపీ నేత మాత్రం ఈ విషయంలో అసంతృప్తితో ఉన్నాడన్న పుకార్లు నగరంలో షికారు చేస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో ఒక్క రిజర్వుడు నియోజకవర్గం కూడా లేకుండా పోయింది. అన్నీ ఓసీ నియోజకవర్గాలే. కొత్తగా ఏర్పడబోయే జిల్లాలనుండి సర్వేపల్లిని మినహాయిస్తే ఉండే 7 నియోజకవర్గాలలో 6చోట్ల రెడ్లే అభ్యర్థులవుతారు. ఇప్పుడు సర్వేపల్లి నెల్లూరులోనే ఉంటే అప్పుడు మొత్తం 8లో 7నియోజకవర్గాలలో రెడ్ల రాజ్యమే. అదంట ఆయన బాధ. జిల్లాలో రెడ్ల ఆధిపత్యానికి చెక్‌పెట్టాలని తపనపడుతున్న ఆ యువ నాయకుడికి సర్వేపల్లి కూడా నెల్లూరులో ఉండడం అస్సలు మింగుడుపడడంలేదని వార్త. అంతే కాకుండా ప్రస్తుత సర్వేపల్లి శాసనసభ్యుడికీ ఆ యువ నాయకుడికీ ఉప్పు-నిప్పుగా ఉందని కూడా రాజకీయవర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితులలో సర్వేపల్లి కూడా నెల్లూరులోనే ఉండబోతోందని తెలిసినప్పటినుండి ఆ యువ నాయకుడికి నిద్రకూడా పట్టడంలేదని నగర వార్త.




అమెరికా లోని ఫ్లోరిడా రాష్ట్రం, టాంపా నగరంలో ఉన్న ‘హిందూ టెంపుల్ ఆఫ్ ఫ్లోరిడా‘లో ఫిబ్రవరి 9 వ తేదీ నుండి 13 వ తేదీ వరకూ 5 రోజులపాటు ఆలయ పుష్కర కుంబాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, గుడి రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ వేడుకలలో ప్రధాన ఉభయకర్తలుగా పాల్గొన్న మన నెలూరు జిల్లా వాసులు డాక్టర్ కేశవరామిరెడ్డి, డాక్టర్ అనుపమ దంపతులు.

# మార్పు మొదలయ్యింది
(మొదటి పేజీ తరువాయి)

అయితే... ముఖ్యమంత్రి పక్కనే ఉన్న కొంతమంది అధికారుల వల్ల, ప్రభుత్వానికి తలనొప్పులు వస్తున్నాయన్న చర్చ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల తరువాత నుండే ప్రారంభమయ్యింది. వందల సంఖ్యలో కోర్టు కేసులు, పదుల సంఖ్యలో ఇచ్చిన జీఓలను ఉపసంహరించుకోవడం, ప్రభుత్వ విధివిధానాల రూపకల్పన వంటి అంశాలతో పాటు అనేక పాలసీ నిర్ణయాలలో ప్రభుత్వం తప్పులో కాలేస్తుందన్న మాట తరచూ వినపడుతూనే వుంది.

రాజకీయ పరిపక్వత లేని కొందరు సలహాదారులతో పాటు, ప్రజామోద పాలన పట్ల అవగాహన, అనుభవం లేని కొంతమంతి సీఎంఓ కార్యాలయ సిబ్బంది వల్లే జగన్ ప్రభుత్వం తప్పులపై తప్పులు చేస్తూ వస్తోందన్నది కూడా కొంతమంది సీనియర్ రాజకీయ నాయకులు, రిటైర్డ్ అధికారుల అభిప్రాయం. ముఖ్యమంత్రి ఆకాంక్షలు, ఆశయాలు, సిద్ధాంతాలు మంచివైనప్పటికి వాటిని ప్రజల ముందు సరైనరీతిలో ఆవిష్కరించడంలో అధికార వ్యవస్థ విఫలమైతే, జగన్ ఆలోచనలకు ప్రజాక్షేత్రంలో ప్రచారం కల్పించడంలో సలహాదారులు ఫెయిల్ అయ్యారన్నది వారి అభిప్రాయం.

### మార్పు... మొదలైనట్లేనా?

ఇప్పుడు అకస్మాత్తుగా ప్రవీణ్ ప్రకాష్‌ని ఢిల్లీకి పంపాలని నిర్ణయించారు ముఖ్యమంత్రి. అంటే మార్పు తన కార్యాలయం నుండే మొదలుపెడుతున్నానన్న సందేశం ఆయన స్పష్టంగా ఇచ్చేశారు. సీఎంఓపై వస్తున్న విమర్శలకు చెక్ పెట్ట



ఏపిపిఎస్‌సి ఛైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గౌతమ్ సవాంగ్

డానికి తీసుకున్న తొలి నిర్ణయం ఇది. ఆయన అక్కడితో ఆగలేదు రాష్ట్ర పోలీసు బాస్ గౌతమ్‌సవాంగ్‌ని డీజీపీ పదవి నుండి తొలగించి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మెన్‌గా పట్టం కట్టారు. ఇదేం చిన్నపదవి కాదు. స్వయంప్రతిపత్తి కలిగిన అత్యున్నత పదవి. గౌతమ్ సవాంగ్‌కి అవమానం జరిగిందని నోర్లు బాదుకున్న ప్రతిపక్షాలు, అరచి గీపెట్టిన జగన్ వ్యతిరేక మీడియాకి ఈ నిర్ణయం చెంప పెట్టులాంటిదే. ప్రవీణ్‌ప్రకాష్‌ని ఢిల్లీకి పంపారంటే అది కూడా అనాలోచిత నిర్ణయమేమీ కాదు. ప్రవీణ్‌లాంటి వ్యక్తి ఢిల్లీలో తమకు అవసరం కాబట్టే ఆయన్ను జగన్ ఢిల్లీకి పంపారు.

జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యుడేమీ కాదు. తనకు తిరుగులేదని విర్రవీగుతుండిన సోనియమ్మనే ఎదిరించి ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలలో ఆమె ఊసే లేకుండా చేసిన ఘనత ఆయనది. జగన్ తెలివిని ఎవరైనా తక్కువగా అంచనా వేస్తే అది వారి తెలివితక్కువ తనమే. ఆయన సమర్థత, నిబద్ధత ఏపాటిదో ఈ రెండు నిర్ణయాలలోనే అర్థమైపోతుంది. కొత్త జిల్లాల ప్రక్రియ పూర్తికావడానికి ఉగాదిని టార్గెట్‌గా పెట్టారు సీఎం. ఆలోగా రాష్ట్ర స్థాయి నుండి జిల్లాస్థాయి వరకు అధికార ప్రక్షాళన చేపట్టబోతున్నారన్నది విశ్వసనీయ సమాచారం.

### త్వరలో... కొత్త మంత్రివర్గం!

ఇదే క్రమంలో త్వరలో కొత్త మంత్రివర్గ ఏర్పాటు నిర్ణయం కూడా తీసుకోబోనున్నారని తాడేపల్లి సమాచారం. ఉన్న వారినందరినీ ఊడబెరికి అంతా కొత్త వారికి ఇస్తారని కొందరు, 7 మంది పాత వారిని ఉంచి 18 మంది కొత్తవారికి చోటు కల్పిస్తారని మరికొందరు ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఊహాగానాలు చేస్తున్నారు. అయితే కొత్త క్యాబినెట్‌ను ఇప్పటికే నిర్ణయించేశారని కూడా తాడేపల్లి వర్గాలు చెప్తున్నాయి. లిస్టు జగన్ దగ్గర సిద్ధంగా ఉందని ఈ నెలాఖరులోగా గానీ లేదంటే మార్చిలో గానీ మార్పు తప్పదని సమాచారం. మంత్రివర్గ విస్తరణ తరువాత, రాబోయే రెండేళ్ళలో ఎవరూ ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటాయని, పార్టీలో కూడా భారీ స్థాయిలో మార్పులు జరుగుతాయని కూడా పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. పార్టీ క్షేత్రస్థాయిలో ఉన్న అసంతృప్తులను, అక్కడక్కడా ఉన్న లోటు పాట్లను గమనించి ప్రక్షాళన చేపట్టి అర్హులకు, సమర్థులకు సముచితస్థానం కల్పిస్తారన్న ఆశాభావాన్ని పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

మొత్తంమీద అటు ప్రభుత్వంలోనూ ఇటు పార్టీలోనూ జగన్ చేపట్టబోయే సంస్కరణలు అర్థంకాక ఆయన మైండ్ సెట్‌ను, వ్యూహాలను పసిగట్టలేక ప్రతిపక్షాలు తలపట్టుకుంటున్నాయి.

### ‘ఉపాధి’లో.. నెల్లూరే ఫస్ట్



మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం లక్ష్యాలను సాధించడంలో రాష్ట్రంలో నెల్లూరే ప్రథమ స్థానంలో నిలిచింది. లక్ష పనిదినాల కల్పన లక్ష్య సాధనలో నెల్లూరు అగ్రగామిగా నిలిచిందంటూ జిల్లా కలెక్టర్ ఈనెల 16న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14కి 1.03లక్షల పనిదినాలు కల్పించి ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయడంలో డ్వామా అధికారులు ముందున్నారని కలెక్టర్ వారిని అభినందించారు.

## 'ప్రభా'తం

# నేరస్థ రాజకీయాలకు.. కళ్లెం పడేనా?

సమజాన్ని మంచిదారిన నడపాల్సిన అనేకమంది రాజకీయ నాయకులు సైతం నేరపూరిత రాజకీయాల్లో ఉంటూ దేశ రాజకీయ వ్యవస్థకే చెడ్డపేరు తెస్తుండడం విచారకరం. రాజకీయపార్టీల ప్రాపకంతో దేశవ్యాప్తంగా ఎంతో మంది ఇలాంటి నేరపూరిత నాయకులు గొప్ప నాయకులుగానే చలామణి అవుతుండడం విడ్డూరం. ఒక్క ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నవారిలో దాదాపు 25 శాతం మందికి పైగానే క్రిమినల్ కేసులున్నాయంటే ఈ నేరస్థ రాజకీయాలు ఎంత ధీమాగా రాజ్యమేలుతున్నాయో అర్థమవుతుంది. ఇకనైనా వీటికి అడ్డుకట్ట వేసేందుకు సుప్రీం చీఫ్ జస్టిస్ ఎన్వి రమణ నేతృత్వంలో న్యాయవ్యవస్థ రంగంలోకి దిగడం శుభపరిణామం. రాజకీయరంగంలో ఇలాంటి పెడధోరణులను నివారించేందుకు, ఎంతోకాలంగా అటకెక్కిన ఆ కేసుల విచారణ ఒక కొలిక్కి తెచ్చేందుకు సుప్రీంకోర్టు సంకల్పించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక మంచి పరిణామం.

ఒకప్పట్లో మన దేశ రాజకీయాలు ఎంతో నీతి నిజాయితీలతో, నిబద్దతతో ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సాగుతుండేవి. ఎందరో మహనీయులైన నేతలు ఉద్భవించిన గొప్ప ప్రజాస్వామిక దేశం మనది. అయితే రానురాను అలాంటి చిత్తశుద్ధి నాయకుల్లో కనుమరుగైపోతుండడం బాధాకరం. ముఖ్యంగా సమజాన్ని మంచిదారిన నడపాల్సిన అనేకమంది రాజకీయ నాయకులు సైతం నేరపూరిత రాజకీయాల్లో ఉంటూ రాజకీయ వ్యవస్థకే చెడ్డపేరు తెస్తున్నారు. రాజకీయపార్టీల ప్రాపకంతో ఎంతోమంది నాయకులు ఎన్ని రకాల ఘోరాలు, నేరాలు చేయాలో రాజకీయాల మాటున అన్నీ నిర్భయంగా చేసేస్తూ ఉంటారు. డబ్బు, పలుకుబడి ఎటూ ఉంటాయి కనుక వారెన్ని చేసినా·ఎవరూ నోరు మెదపడానికి లేదు అన్నట్లుగా ఉంటుంది పరిస్థితి. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇలాంటి నేరపూరిత నాయకులెందరో గొప్ప నాయకులుగానే చలామణి అవుతుండడం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో మరికొందరు నాయకులు మరింత ఘోరంగా తయారై ప్రజల్ని భీతావహుల్ని చేసే నేరప్రవృత్తితో ఉంటూ ప్రజాకంటకులుగా కూడా తయారవుతున్నారు. నేరస్థ రాజకీయాలు దేశంలో అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నా ఎవరూ పట్టించుకొనే పరిస్థితి ఉండడం లేదు. పట్టించుకోవాల్సింది నాయకగణమే కావడంతో వారు ఎలాగూ పట్టించుకోరు?.. ఎంతోకాలంగా భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చగా దాపురించిన ఈ దుస్థితి నుంచి ఇక మనదేశానికి విముక్తే లేదా?.. అనుకుంటున్న తరుణంలో 'మేమున్నాం' అంటూ సుప్రీంకోర్టు భరోసా ఇస్తుండడం దేశానికి శుభపరిణామం. సుప్రీం చీఫ్ జస్టిస్ ఎన్వి రమణ రాజకీయరంగంలో ఇలాంటి పెడధోరణుల పట్ల అసహనం వ్యక్తం చేస్తుండడమే కాక, రాజకీయ నాయకులపై ఇప్పటికే నమోదై ఉన్న వేలాది క్రిమినల్ కేసుల విచారణ ఏళ్ల తరబడిగా జాప్యం జరుగుతుండడం ఏమిటని మండిపడ్డారు. ఆ కేసులను వెంటనే విచారణ చేయాలంటూ కొన్ని మార్గదర్శకాలను కూడా జారీ చేశారు. అయినా, మన రాజకీయనాయకుల్లో అదురులేదు..బెదురులేదు. ఇవన్నీ మామూలేగా..ఎప్పటికి ఇవి జరిగేవి?.. అన్నట్లుగా తమ పని తాము నిర్భయంగా కానిచ్చేసుకుంటున్నారు. అందుకే రాజకీయపార్టీలు ఎన్నికలొస్తే చాలు..అలాంటి నేరస్థులకు కూడా సీట్లు కేటాయించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలుచేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నవారిలో దాదాపు 25 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయంటే ఈ నేరస్థ రాజకీయాలు ఎంత ధీమాగా రాజ్యమేలుతున్నాయో అర్థమవుతుంది. చట్టసభల్లో ఉంటూ దేశాన్ని చట్టబద్ధంగా న్యాయబద్ధంగా పాలించాల్సిన కొంతమంది ఘనులు కూడా ఇలా నేరపూరిత రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. అలాంటి వారిపై నమోదైన కేసులు వేలసంఖ్యలోనే ఉండడం విడ్డూరం. 2021 డిసెంబరు నాటికి ఇలాంటి కేసుల సంఖ్య 4,984 దాకా ఉన్నాయని ఒక అంచనా. ఈ కేసుల్లో దేవభూమిగా పేరొందిన ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉండడం విచారకరం. నేరాలను నిరోధించి మంచి సమాజానికి పునాదులు వేయాల్సిన రాజకీయ నాయకులే నేరాలను ప్రోత్సహించడం, నేరాల్లో కీలక పాత్రలు పోషిస్తుండడం ఎంతో ఘోరం?.. ప్రజలకు, సమాజానికి మేలు చేయాల్సిన నాయకులే నేరస్తులుగా మారడం ఎంత దౌర్భాగ్యం?. నేరస్తులు నేరుగా రాజకీయాల్లోకి వచ్చేస్తే, వారికి పార్టీల వారు రెడ్‌కార్పెట్ పరిచి స్వాగతిస్తే ఇక సమాజాన్ని బాగుచేసేదెవరు?..ఎన్నికల్లో నేరస్తులకు పోటీచేసే అవకాశం కల్పించకూడదని సుప్రీంకోర్టుతో పాటు ప్రజాస్వామ్యవాదులంతా ఎప్పటినుంచో ఘోషిస్తూనే ఉన్నారు. అయినవాళ్ళకి అందలం.. కానివాళ్లకి మంగళం అన్నట్లుగా వ్యవహరించడం, తాము రాజకీయ నాయకులం కదా మనకిక అడ్డేముందనే తత్వంతో అడ్డదిడ్డంగా వ్యవహరించడం, అవసరం తీరాక జనాన్ని బెదిరించడం, భయకంపితులను చేయడం దేశంలో సాధారణమైన ఘట్టాలుగానే ఉంటున్నాయి. తాము ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగానే ఉండాలనే నాయకుల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. అధికారం అండదండలతో నేరపూరిత రాజకీయాలతో వీరవిహారం చేసే నాయకులకు అడ్డే ఉండడం లేదు. ఇక సాదాసీదా ప్రజల బాధలు పట్టించుకునేదెవరు?.. నాయకులే నిందితులుగా ఉంటున్న అనేక కేసులు ఏళ్ళు జరుగుతున్నా విచారణ మాత్రం జరగడం లేదు. దాదాపు 30 ఏళ్లుగా ఆ విచారణ నత్తనడక నడుస్తూనే ఉందంటే రాజకీయ పార్టీల ప్రాబల్యం, ప్రభావం ఎంతగా ఉంటున్నాయో అర్థం చేసుకోవచ్చు. అసలు ఈ కేసుల విచారణలో ఎందుకు జాప్యం జరుగుతుందో నిగ్గుతేల్చడానికి ఒక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటుచేయాలని దాదాపు నాలుగేళ్ళ క్రితమే సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వానికి సూచించినా కేంద్రం కానీ, రాజకీయపార్టీలు కానీ నేటికీ పట్టించుకోకపోవడం దారుణం. ఇక ఇలాంటి దుర్నీతులకు అడ్డుకట్ట వేసేందుకు చీఫ్ జస్టిస్ ఎన్వి రమణ నేతృత్వంలో సుప్రీంకోర్టు కొరడా పట్టుకోనుంది. నాయకులపై ఉన్న పెండింగ్ కేసుల్లో ప్రత్యేక విచారణకు 'సుప్రీం' రంగం సిద్ధం చేస్తోంది. కేంద్రం, పాలకులు, ఉన్నతస్థాయి నాయకులు అందరూ కలసి సుప్రీం న్యాయవ్యవస్థ సూచనల మేరకు ఈ నేరస్థ రాజకీయాలకు ఇకనైనా పూర్తిస్థాయిలో కళ్ళెం వేయాలి. భారత ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ, నేరాలతో కలుషితమైన రాజకీయాలను ప్రక్షాళనం చేసుకుని ఉత్తమమైన రాజకీయాలతో దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలి. భావితరాలకు మన రాజకీయాలు మార్గదర్శకం కావాలి.

# వైభవంగా భీష్మ ఏకాదశి

### శ్రీ రంగనాధునికి గరుడసేవ



భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఇటీవల జిల్లాలోని పలు వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు, సేవలు జరిగాయి. తులసీదళాలతో అర్చనలు, విష్ణుసహస్ర నామ పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో స్వామివారికి వైభవంగా గరుడసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, నిశింద సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ శివకుమార్‌ఆచారి, ఇ.ఓ వెంకటేశ్వర్లు ఈ వేడుకను పర్యవేక్షించారు.

### శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో :



భీష్మ ఏకాదశి రోజున నెల్లూరు నగరంలోని పప్పులవీధిలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు ముదివర్తి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా 54 మంది దంపతులతో సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీసభ్యులు రామచంద్రరావు, పాదర్తి బాలాజీ, పెనుగొండ సుబ్బారావు. ఆలయ కార్యనిర్వహణాధికారి కామేశ్వరరావు పాల్గొన్నారు.

### వేదగిరి లక్ష్మీనృసింహునికి వేడుకగా పూజలు :

నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై కొలువైవున్న వేదగిరి శ్రీ లక్ష్మీ నృసింహస్వామివారికి, అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణలు చేసి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం లక్షతులసిపూజ, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి కల్యాణోత్సవం, గిరిప్రదక్షిణ ఉత్సవం నిర్వహించారు. ఆలయ ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

# ఉదయగిరిని మరచిపోయారా?

జిల్లాలో ఉదయగిరికి ఎంతో చరిత్ర ఉంది. నాటి రాజుల కాలంలో ఉదయగిరి వైభవం అంతా ఇంతా కాదు. సముద్ర మట్టానికి దాదాపు 3079 అడుగుల ఎత్తులో ఉదయగరి కోటను అత్యద్భుతంగా నిర్మించారు. ఇప్పటికీ ఆ కోట నాటి చారిత్రిక వైభవానికి సాక్ష్యంగా నేటికీ నిలిచే ఉంది. అయితే శిథిలావస్తకు చేరింది. ఒకప్పట్లో కాకతీయులు, పల్లవులు, విజయనగర రాజు శ్రీకృష్ణదేవరాయలు వంటి మహరాజులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. ఉదయగిరి కొండ ప్రాంతమంతా ఎంతో రమణీయంగా ఉంటుంది. ఈ కొండల్లోనే భైరవకోన వంటి అపురూప క్షేత్రం, ఉదయగిరిలో ప్రాచీనమైన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. ఎత్తైన వృక్షాలు, జలపాతాలు, సెలయేళ్ళు ప్రకృతి సోయగాలన్నిటినీ కుప్ప పోసినట్లుగా ఉండే కనువిందైన ప్రాంతం ఉదయగిరి. ఎన్నో వందల రకాల ఔషధగుణాలున్న చెట్లు, వనమూలికలు ఇక్కడ లభ్యమవుతాయి. శతాబ్దాల ఘనచరిత్ర ఉన్న ఉదయగిరిని కాలక్రమంలో అందరూ మరచిపోతుండడం బాధాకరం. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని మన నాయకులు చెప్తుంటారే తప్ప ఆచరణలో పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలోనే ఉన్న అరుదైన ప్రాంతాల్లో ఒకటైన ఉదయగిరిని అభివృద్ధి చేయడం ద్వారా జిల్లాకు మరింత ప్రతిష్ట చేకూరుతుంది. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటకులకు కూడా ఇది ఒక మంచి కేంద్రమవుతుంది. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాకే తలమానికమైన కోటగా ఉన్న ఉదయగిరి కోటను, ఉదయగిరిలోని ఆలయాలను పరిరక్షించుకునేందుకు చర్యలు తీసుకుంటే బావుంటుంది.

**ఎస్.సీతారావమ్మ, ఉదయగిరి.**




## బీచ్‌ల వద్ద బందోబస్తు అవసరం

జిల్లాలోని సాగరతీరాలకు నిత్యం ఎందరో పర్యాటకులు వస్తుంటారు. ఎంతో ఉత్సాహంతో సముద్రంలోకి స్నానానికి దిగుతుంటారు. ఎవరెంతగా చెప్తున్నా వారి ఉత్సాహాన్ని ఆపలేం. అయితే, ఇదే సందర్భంలో దురదృష్టవశాత్తూ సముద్రంలో మునిగిపోయి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. బీచ్‌ల వద్ద ఆయా ప్రాంతాలకు సంబంధించిన బాధ్యత గలిగిన వ్యక్తులను, లేదా ఒకరిద్దరు పోలీసులను బందోబస్తుగా ఏర్పాటుచేయడం అవసరం. బీచ్‌ల వద్ద గజ ఈతగాళ్ళను సిద్ధంగా ఉంచడం కూడా ముఖ్యం. ముఖ్యంగా తరచూ ప్రమాదానికి గురయ్యే ప్రాంతాల్లో ప్రమాదసూచికల బోర్డులను ఏర్పాటుచేయడం, అటుగా వెళ్లవద్దని హెచ్చరించడం చేస్తుంటే కొంతవరకైనా ప్రమాదాలు తప్పుతాయి.

**హెచ్.ప్రభాకర్, ముత్తుకూరు.**

# పల్లెల్లో మురుగు అట్లనే ఉంది

పల్లెలు పరిశుభ్రంగా ఉండాలని అధికారులు పదేపదే చెప్తున్నా ఆచరణకు వచ్చేసరికి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఎక్కడి చెత్త అక్కడనే ఉంటోంది. మురుగు కాలువలు, చెత్తాచెదారం పేరుకుపోయి అనేక గ్రామాలు దుర్గంధంలోనే ఉంటున్నాయి. వీధుల్లో సరైన సైడుకాలువలు లేక, ఉన్నా వాటిని సకాలంలో పూడికలు తీయక మురుగంతా రోడ్లమీదకి వస్తూనే ఉంది. పారిశుధ్యం–పరిశుభ్రత అంటూ నినాదాలు బాగానే ఉంటున్నాయి కానీ, వాటిని కొంచమైనా ఆచరణలో పెట్టేందుకు అధికారులు సిబ్బందితో పాటు ప్రజలు కూడా సహకరించాలి. ఎవరికి వారు చెత్తాచెదారాన్ని నిర్ణీత పద్ధతుల్లో తొలగించుకుంటే ఏ బాధా ఉండదు. ఎవరో వస్తారని, ఏదోచేస్తారని ఎంత కాలం ముక్కులు మూసుకోగలం?.. మనం ఇష్టం వచ్చినట్లు ఇళ్ళముందర, రోడ్లపై మనం పడేసే చెత్తాచెదారమే మనకు వ్యాధుల బాధలను తెస్తోంది. దోమలు, ఈగలు పెరిగి నానారకాల జబ్బులతో బాధపడేకంటే మన పరిసరాలను మనం బాగుచేసుకుంటే ఏ బాధా ఉండదు కదా!..

**– ఆర్. ఈశ్వర్‌రావు, బాలాయపల్లి.**

## కళ్యాణ వైభోగం...!







### వెంకటరుత్విక్ - శ్రీస్ఫూర్తి

నెల్లూరు జిల్లా వీరంపల్లి వాస్తవ్యులు, చెన్నై నివాసి వ్యాపార వేత్త వల్లూరు రవీంద్రకుమార్‌రెడ్డి - కామాక్షి దంపతుల కుమారుడు **రుత్విక్ - స్ఫూర్తి** (మరో నెల్లూరీయుడు ప్రముఖ ఆడిటర్ పులి అశోక్‌రెడ్డి - స్వరూపల కుమార్తె )ల కళ్యాణం ఫిబ్రవరి 5 న, రిసెప్షన్ ఫిబ్రవరి 6న చెన్నైలో వైభవంగా జరిగాయి. రెండు కుటుంబాల బంధుమిత్రులతో పాటు అనేకమంది రాజకీయ, వ్యాపార, పారిశ్రామిక ప్రముఖులు ఈ రెండు వేడుకలలో పాల్గొని కొత్త దంపతులను దీవించారు. రుత్విక్ - స్ఫూర్తిలకు 'లాయర్' శుభాశీస్సులు.

## 'సమతామూర్తి' విగ్రహం..

# ప్రపంచంలోనే 8వ అద్భుతం

### వెయ్యేళ్ళ క్రితమే సమాజానికి చైతన్యం తెచ్చిన భగవత్ రామానుజులు

**- కొనియాడిన ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**




*ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద 216 అడుగుల 'సమతామూర్తి' భగవత్ రామానుజుల పద్మాసనస్థ విగ్రహాన్ని ఇటీవల తెలంగాణలోని ముచ్చింతల్‌లో భారత ఉప రాష్ట్రపతి, మన నెల్లూరీయుడు ఎం.వెంకయ్యనాయుడు దర్శించుకున్నారు. భగవత్ రామానుజుల ఆదర్శాలను, ఆ మహనీయుని జీవితాన్ని వివరిస్తూ తనదైన శైలిలో ఉపన్యసించి అందరినీ ఆకట్టుకున్నారు. రామానుజుల జీవిత విశేషాలను ప్రస్తావిస్తూ ఆ మహానుభావుడు వెయ్యేళ్ళ క్రితమే కులమతాలకు వ్యతిరేకంగా పోరాడారని, ప్రస్తుతం కొన్నివర్గాలు రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కుల, వర్గ వైషమ్యాలను ప్రోత్సహిస్తున్న తరుణంలో భగవత్ రామానుజాచార్యుల బోధనలు మనకు ప్రేరణ కలిగించాల్సి ఉందని చెప్పారు. భగవత్ రామానుజుల స్ఫూర్తిని అందుకుని ప్రతిఒక్కరూ నవభారత నిర్మాణానికి కృషిచేయాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు.*

హైదరాబాద్ సమీపంలోని ముచ్చింతల్ శ్రీరామనగరంలో ఏర్పాటుచేసిన 'సమతామూర్తి' 216 అడుగుల భారీ భగవత్ రామానుజుల విగ్రహం ప్రపంచంలోనే 8వ అద్భుతమని భారత ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు కొనియాడారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణం కోసం శ్రీ రామానుజాచార్యులు ఎంతో కృషిచేశారని, వారి ఆదర్శాలు సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని ఆయనన్నారు. సమతామూర్తి కేంద్రంలో జరుగుతున్న శ్రీ రామానుజాచార్యుల సహస్రాబ్ది ఉత్సవాల్లో ఉప రాష్ట్రపతి పాల్గొని సమతామూర్తి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ వెయ్యేళ్ళ క్రితమే అంటరానితనం, వివక్ష, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా రామానుజాచార్యులవారు పోరాడారని, కులమతాలకు అతీతమైన సమాజాన్ని ఆకాంక్షించిన రామానుజులు అంటరానితనం అమానుషమని పేర్కొంటూ నాటి సమాజంలో నిర్భయంగా చాటి సమాజానికి చైతన్యాన్ని అందించాడన్నారు. భగవంతుడు ఏ కొందరికో కాదు.. అందరివాడు అంటూ నాటి కాలంలో రామానుజులవారు ప్రవచించిన విశిష్టాద్వైతం ప్రపంచానికి నూతన ఒరవడితో కొత్తమార్గం చూపిందన్నారు. భగవత్ రామానుజులు ఆధ్యాత్మికవేత్తగానే కాక సామాజిక సంస్కరణాభిలాషిగా సమాజంపై చెరగని ముద్ర వేశారని ఆయన చెప్పారు. రామానుజుల స్ఫూర్తిని అందరికీ పంచడమే ఆయనకు అసలైన నివాళి అని అంటూ, వారి ఆశయాలను నేటి యువత అర్థం చేసుకుని నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఉప రాష్ట్రపతి ఆకాంక్షించారు. గాంధీ మహాత్ముడు సూచించిన హరిజన పదంలోనూ ఇదే స్ఫూర్తి ఉందన్నారు. మహాత్ముడు ఎంతో ఇష్టపడే 'వైష్ణవ జన్ తో' గీతం కూడా రామానుజులవారి స్ఫూర్తితో రచించినదేనన్నారు. భగవత్ రామానుజులవారి సమతా స్ఫూర్తితో కేంద్రప్రభుత్వం కూడా అనేక పథకాలను అమలులోకి తెచ్చిందని, వాటిలో ప్రధానంగా స్త్రీల విద్యవిషయంలో సమతామూర్తి ఆలోచనావిధానాన్ని ఆచరణలోకి తెస్తూ కేంద్రప్రభుత్వం బాలికావిద్యను ప్రోత్సహిస్తూ 'భేటీబచావో..భేటీ పడావో' పథకం ప్రవేశపెట్టిందన్నారు. శ్రీ రామానుజా చార్యులవారి విశిష్టతను



ప్రపంచానికి చాటుతూ అతిపెద్ద 'సమతామూర్తి' విగ్రహాన్ని ముచ్చింతల్‌లో ఏర్పాటుచేయడం ఆ మహానుభావుని గొప్పతనాన్ని చాటుతుందన్నారు. రామానుజాచార్యుల స్ఫూర్తిని చాటేందుకు సమతామూర్తి కేంద్రం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. అందుకు విశేష కృషి చేసిన చిన్నజియ్యర్ స్వామికి, భూమిని విరాళంగా ఇచ్చిన జూపల్లి కామేశ్వరరావుకు, రామానుజ సహస్రాబ్ది కమిటీవారికి, అందరికీ ఉప రాష్ట్రపతి అభినందనలు తెలియజేశారు. సమతామూర్తి ప్రాంగణంలో తెలుగుభాషాభివృద్ధికి బాటలు వేసేలా, తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను చాటేలా కూడా ఒక కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే బావుంటుందని చిన్నజియ్యర్‌స్వామికి ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు సూచించారు. ఉప రాష్ట్రపతి వెంట హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రులు ప్రహ్లాద్‌జోషి, అశ్విన్ కుమార్, తెలంగాణ మంత్రి మహమూద్ ఆలీ, ఏపి మాజీమంత్రి కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గురి తప్పని రామబాణం



- ఈ ఏడాది ఇస్రో తొలి విజయం
- పిఎస్ఎల్‌వి సి-52 సక్సెస్

*అందరూ అనుకున్నట్లుగానే పిఎస్ఎల్‌వి సి-**56** రాకెట్ ప్రయోగం దిగ్విజయమైంది. పిఎస్ఎల్‌వి అంటేనే గురి తప్పని రామబాణం అనే పేరును మళ్ళీ మరోసారి సార్థకం చేసుకుంది. ఈ ఏడాదిలో తొలి విజయం సాధించింది. ఇస్రో ఛైర్మెన్‌గా కొత్తగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సోమనాథ్ సారధ్యంలో సోమవారం వేకువనే సాగిన తొలి ప్రయోగం విజయవంతమైంది. రాకెట్‌తో పాటు పంపిన మూడు ఉపగ్రహాలు కూడా అంతరిక్షం కక్ష్యలోకి జయప్రదంగా చేరిపోయాయి. ఇస్రో శాస్త్రవేత్తల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ ఉత్సాహంతో త్వరలోనే పిఎస్ఎల్‌వి సి **53** రాకెట్‌ను ప్రయోగించేందుకు సమాయత్తమవుతున్నారు.*



రాకెట్ గమనాన్ని పరిశీలిస్తున్న ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్

శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి ఈనెల 14వ తేది ఉదయం 5-59 గంటలకు షార్ శాస్త్రవేత్తలు ప్రయోగించిన ప్రతిష్టాత్మకమైన పిఎస్ఎల్‌వి (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్) సి-56 నిప్పులు చిమ్ముకుంటూ నింగికెగిసింది. అంతరిక్షంలోకి దూసుకువెళ్ళి కేవలం 18.47 నిమిషాల్లోనే తనతోపాటు తీసుకువెళ్ళిన మూడు ఉపగ్రహాలు నిర్ధేశిత కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది. 18 నిమిషాల వ్యవధిలోనే భూమికి 529 కిలోమీటర్ల ఎత్తుకు చేరిన పిఎస్ఎల్‌వి-సి52 రాకెట్ తొలుత భూ పరిశీలన ఉపగ్రహం (ఇఓఎస్-04)ను, ఆ తర్వాత 47 సెకన్లలో ఇన్‌స్పైర్-1, ఐఎన్ఎస్ 2-డి ఉపగ్రహాలను కక్ష్యలోకి తీసుకువెళ్ళి జయప్రదంగా విడిచిపెట్టింది. 'దటీజ్ పిఎస్ఎల్‌వి' అనిపించుకుంది. ఇస్రో శాస్త్రవేత్తలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తూ అత్యద్భుతంగా గగనంలోకి అన్ని దశలనూ దాటుకుంటూ దూసుకువెళ్ళి నిర్ధేశించిన లక్ష్యాలను దిగ్విజయంగా సాధించింది. దీంతో ఇస్రో ఖాతాలో మరో ఘనవిజయం నమోదైనట్లయింది. అంతరిక్ష రంగంలో భారత్ ప్రతిభాపాటవాలు మరోసారి ప్రపంచానికి చాటినట్లయింది. ఇస్రో ఇప్పటిదాకా పిఎస్ఎల్‌వి సీరీస్‌లో 54 పిఎస్ఎల్‌వి రాకెట్లను ప్రయోగిస్తే, వాటిలో కేవలం రెండు మాత్రమే గురితప్పాయి. 52 రాకెట్లు విజయవంతంగా లక్ష్యాన్ని చేరుకుని అంతరిక్ష రంగంలో భారత్ కీర్తిపతాకను రెపరెపలాడించాయి. దీంతో పిఎస్ఎల్‌వి రాకెట్ ప్రయోగం అంటేనే విజయం ఖాయం అనే మాట ఈసారి కూడా రుజువైంది.

### ఉపగ్రహాలతో ఎంతో ఉపయోగం

పిఎస్ఎల్‌వి సి-52 రాకెట్ ద్వారా శాస్త్రవేత్తలు పంపిన ఉపగ్రహాలు ఎంతో ఉపయోగపడనున్నాయి. 1710 కిలోల బరువున్న ఈ భూ పరిశీలన ఉపగ్రహం ద్వారా పదేళ్ళ పాటు పరిశోధనలు సాగేలా దీనిని రూపొందించారు. మనదేశంలో వ్యవసాయం, అడవులు, తోటలు, నేల తీరుతో పాటు జల వనరుల స్థితిగతులు, వరదలకు సంబంధించిన సమాచారం ఈ ఉపగ్రహం అందజేయనుంది. ఎలాంటి వాతావరణంలోనైనా సరే స్పష్టమైన ఛాయాచిత్రాలను తీయగల సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది. అదేవిధంగా, 17.5 కిలోల బరువున్న ఐఎన్ఎస్-2డి ఉపగ్రహం నీటి ఉపరితల ఉష్ణోగ్రతలు, భూమి ఉష్ణస్థితి, వృక్ష సంపదల సమాచారాన్ని తెలిపేందుకు ఉపయోగపడుతుంది. ఆరు నెలల పాటు ఇది పనిచేసేలా నిర్ధేశించారు. 8.1 కిలోల బరువున్న మూడవ ఉపగ్రహం ఇన్‌స్పైర్-1 ప్రత్యేకంగా సూర్యునిపై పరిశోధనకు, సూర్యుడిలోని ఐనోస్పియర్ పొరను అధ్యయనం చేయడంతో పాటు కరోనల్ హీటింగ్‌పై పరిశీలనకు ఉపయోగపడుతుంది. ఏడాదిపాటు ఇది పనిచేయనుంది.

### షార్‌లో హుషార్

కరోనా మహమ్మారి సంక్షోభంతో గత కొద్దికాలంగా జాప్యమవుతున్న రాకెట్ ప్రయోగాలు తాజాగా పిఎస్ఎల్‌వి స-52 విజయవంతంతో మళ్ళీ ఊపందుకోనున్నాయి. ప్రయోగం విజయవంతం కావడంతో షార్‌లో శాస్త్రవేత్తలు, ఉద్యోగుల్లో సంతోషం పెల్లుబికింది. ఈ ప్రయోగ విజయంతో శాస్త్రవేత్తలు మరింత ఉత్సాహంతో ప్రయోగాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్ సారధ్యంలో అంతరిక్ష శాస్త్రవేత్తలు ఈ ఏడాది మరిన్ని రాకెట్ ప్రయోగాలకు, త్వరలోనే చంద్రయాన్ ప్రయోగానికి కూడా సన్నద్ధమవుతుండడం విశేషం.

లాయర్





















### ఆత్మీయ ఆనంద వేడుకగా

# మన వెంకయ్య మనుమరాలి పెళ్ళి



## సుష్మ - కిషన్

**భా**రత ఉపరాష్ట్రపతి, ఉషాపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు – శ్రీమతి ఉషమ్మల ముద్దుల మనుమరాలు **సుష్మ - కిషన్**ల కళ్యాణ వేడుకలు అయిదు రోజుల పాటు అంగరంగ వైభవంగా, ఆత్మీయ ఆనంద సంబరాలుగా జరిగాయి. ఫిబ్రవరి 7, 8, 9, 10, 13వ తేదీల్లో జరిగిన ఈ వేడుకలలో వెంకయ్య కుటుంబ ఆప్తులు, ఆత్మీయులు, అభిమానులతో పాటు వరుని బంధువులు పాల్గొని కొత్త జంటను ఆశీర్వదించారు.

తొలుత 7వ తేదీ మద్రాసులో రైన్ ట్రీ హోటల్‌లో గంధపు నలుగు జరిగింది. ఈ వేడుకకు వధువు సుష్మ సోదరుడు ఇమ్మణ్ణి విష్ణు పేరుతో ఆహ్వానం అందుకున్న అతిథులు పరిమిత సంఖ్యలో పాల్గొని కొత్త పెళ్లికూతురును దీవించారు. 8వతేది తిరుపతి తాజ్ హోటల్‌లో మెహిందీ ముచ్చట జరిగింది. వధువు అమ్మమ్మ ఉషమ్మ, నానమ్మ శేషారత్నంలు ఈ కార్యక్రమానికి కూడా అతి పరిమిత సంఖ్యలోనే బంధుమిత్రులను ఆహ్వానించారు. ఇక 9వ తేదీ తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో నలుగు – పెళ్ళికూతురు వేడుకలో వధూవరుల పరిచయ కార్యక్రమం కూడా అత్యంత ఘనంగా జరిగింది. దశాబ్దాల కాలంగా వెంకయ్య వెంట నడుస్తున్న ఆయన శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో ఈ సంబరంలో పాల్గొని కాబోయే వధూవరులనకు తమ ఆశీస్సులు అందించారు. 10వతేది ఉదయం సాక్షాత్తూ కలియుగ వైకుంఠవాసుడైన ఆ శ్రీనివాసుని సన్నిధిలో, ఆధ్యాత్మిక నగరమైన తిరుమల పుష్పగిరిమఠంలో శోభాయమానంగా ముస్తాబైన వేదికపై సుష్మ – కిషన్‌లు మూడుముళ్ళ బంధంతో, ఏడడుగులు కలసి నడచి ఆలూమగలయ్యారు. ఈ కళ్యాణ వైభవానికి అనేక రంగాలకు చెందిన దేశ, రాష్ట్ర ప్రముఖులు హాజరై కొత్త దంపతులకు తమ దీవెనలందించారు.

13వతేదీ మద్రాసులోని లీలాప్యాలస్ హోటల్‌లో రిసెప్షన్ ఆనంద సంరంభంగా జరిగింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులతో సహా కర్ణాటక, తమిళనాడులతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యాపార, పారిశ్రామిక, రాజకీయ ప్రముఖులు పాల్గొని నవ దంపతులను దీవించారు.

9వతేదీ ఆ తరువాత జరిగిన అన్ని వేడుకలలో సుష్మ తాతయ్య వెంకయ్యనాయుడు పాల్గొని ఆనందోత్సాహంతో తన్మయత్వం చెందారు. తన ముద్దుల మనవరాలిని పెళ్ళికూతురుగా చూసి మురిసిపోయారు. వధువు అమ్మా నాన్నా వెంకట్‌రావు – దీపమ్మలతో పాటు వరుని తల్లితండ్రులు గోవిందరాజు, ఆషా గోవిందరాజులు వచ్చిన ప్రతి అతిథినీ ఆప్యాయంగా స్వాగతించి పలకరించారు.

కొత్త దంపతులు సుష్మ – కిషన్‌లకు 'లాయర్' శుభదీవెనలు.


























# ప్రత్యేకహోదాతో కేంద్రం ఆటలు!

విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐదు కాదు... పదేళ్ళ పాటు ప్రత్యేకహోదా ఇస్తాం అంటూ 2014 ఎన్నికలకు ముందు ఆంధ్ర ప్రజలను జో కొట్టిన బీజేపీ నేతలు, ముఖ్యంగా ప్రధానమంత్రి మోదీ ఎన్నికలయ్యాక ఆంధ్రతో పరాచికాలాడడం ప్రారంభించినట్లు కనబడుతోంది. బీజేపీకి 2014 ఎన్నికల్లో పూర్తి మెజారిటీ రాకపోతే, మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసి రావచ్చునన్న అనుమానంతో ఆ ఎన్నికల్లో అధికారానికి చేరువలో ఉన్న తెలుగుదేశం పార్టీతో మోదీ అంట కాగారు. ఆంధ్రాలో కుడిపక్కన పవన్‌కళ్యాణ్‌ను ఎడం పక్కన చంద్రబాబునాయుడును కూర్చోపెట్టుకుని ఆంధ్ర జనాలను హామీలతో కితకితలు పెట్టారు. అప్పటివరకు మోదీ నైజం తెలియని ఆంధ్ర జనం మోదీ భజనలో మునిగి తేలారు.

ఆ ఎన్నికల్లో మోదీకి పూర్తి మెజారిటీ వస్తుందని చంద్రబాబు కూడా ఊహించలేదు. దాంతో, ఎన్నికల తరువాత కేంద్రం టీడీపీపై ఆధారపడక తప్పదని అంచనా వేసిన చంద్రబాబునాయుడు, కేంద్రం నుంచి డబ్బులు తేవచ్చునన్న ఆలోచనతో ఎడాపెడా హామీలపై హామీలు ఇచ్చారు.

2014 ఎన్నికల్లో బీజేపీకి కేంద్రంలో పూర్తి మెజార్టీ రావడంతో, అప్పటిదాకా కడుపులో దాచుకుంటూ వచ్చిన 'బాబు వ్యతిరేకత'ను బయటికి తీశారు. ప్రత్యేకహోదా లేదు పొమ్మన్నారు. పోలవరంను జాతీయ ప్రాజెక్ట్‌గా కేంద్రం ఎన్నికలకు ముందే ప్రకటించినప్పటికీ మేం కట్టం... మీ ఏడుపు మీరు ఏడవండి అన్నారు. విశాఖకు రైల్వేజోనా... గోంగూరా అన్నారు. రాజధాని అమరావతి శంకుస్థాపనకు రండి మహాప్రభో అని వేడుకుంటే... ఢిల్లీ నుంచి గుప్పెడు మట్టి, చెంబుడు నీళ్లు తెచ్చి ఇచ్చారు.



మనలో మాట 57

చంద్రబాబుకు విషయం సంపూర్ణంగా... సమగ్రంగా అర్ధమైంది. కానీ, ఏమాత్రం బయటపడకుండా ఒకటికి పదిసార్లు ఢిల్లీ వెళ్లడం ఆయనకు ఓ శాలువా కప్పి, తిరుపతి లడ్డూలు చేతిలోపెట్టి దణ్ణం పెట్టి... తిరిగిరావడం మొదలుపెట్టారు.

ఈ మొత్తం ప్రహసనాన్ని ఢిల్లీలో మోదీ లోపల్లోపలే ఎంజాయ్ చేస్తుంటే ఇక్కడ ఆంధ్రాలో జగన్మోహనరెడ్డి టీడీపీని కార్నర్ చేయడం మొదలుపెట్టారు. దీంతో, ప్రత్యేకహోదా అనేది ముగిసిన అధ్యాయమని, ప్రత్యేక ప్యాకేజ్ ఇస్తున్నారని చంద్రబాబు మాట్లాడడం మొదలుపెట్టారు. ప్రత్యేకహోదా అన్నారో... జైలే అని కూడా చంద్రబాబు అన్నారు. వైసీపీ స్పీడు పెంచింది. హోదా కోసం గుంటూరులో జగన్ మూడురోజుల నిరాహారదీక్ష చేశారు. ప్రత్యేకహోదా వస్తే రాష్ట్రం ఎంతగా అభివృద్ధి చెందుతుందో సాక్షి మీడియా గ్రాఫిక్స్‌తో కళ్ళకు కట్టినట్లు రోజూ చూపిస్తూ వచ్చింది.

దీంతో, ప్రత్యేకహోదా అనే భావన కోవిడ్, ఒమిక్రాన్ వైరస్ లాగా రాష్ట్రం మొత్తం చుట్టేసింది. ప్రత్యేకహోదా సాధించడం చంద్రబాబు వల్ల కాదన్న అభిప్రాయానికి కూడా జనం రావడం మొదలుపెట్టారు. మరోపక్క, వైసీపీ దూకుడుతో చంద్రబాబు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. హోదా ఇవ్వనందుకు నిరసనగా వైసీపీ ఎంపీలు వి.వరప్రసాద్‌రావు, వై.వి.సుబ్బారెడ్డి, వై.ఎస్.అవినాష్ రెడ్డి, పి.మిథున్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి 2018 ఏప్రిల్ 6వ తేదీన తమ లోకసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు.

అప్పటికి అసెంబ్లీ ఎన్నికలు సరిగ్గా సంవత్సరం దూరంలో ఉన్నాయి. ప్రమాదాన్ని పసిగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మోదీపై తిరగబడ్డారు. కేంద్ర మంత్రివర్గం నుంచి అశోక్ గజపతిరాజును రాజీనామా చేయించారు. ఎన్‌డీఏతో తెగతెంపులు చేసుకుంటున్నాం అన్నారు. ధర్మాగ్రహం పేరుతో ఢిల్లీలోను, జిల్లా కేంద్రాలలోనూ భారీసభలు నిర్వహించి, మోదీని తూర్పారబట్టారు. ఫుట్‌బాల్ ఆడుకున్నారు. మంత్రులు కూడా నోళ్లకు పని చెప్పారు. ఇది ఆంధ్రాలో ఎన్నికలకు ఒక భావోద్వేగ ఇష్యూగా మారుతుందని చంద్రబాబు అంచనా వేశారు.

మారలేదు. దీనికితోడు, జగన్ అయితేనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తుంది అనే ప్రచారం చాప కింద నీరులాగా రాష్ట్రంలో బలంగా వ్యాపించింది. దీనికితోడు, చంద్రబాబును 2019లో ఓడించాల్సిందే అని అటు మోదీ, ఇటు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కంకణం కట్టుకుని కూర్చున్నారు. ఎవరి కారణాలు వారివి.

ఇన్ని కారణాలు ఏకోన్ముఖం కావడంతో, జగన్ విజయం నల్లేరు మీద బండి నడక అయిపోయింది. 'నాకు పాతిక ఎంపీ సీట్లు ఇవ్వండి... ప్రత్యేకహోదా ఎలా ఇవ్వరో చూస్తాం ...' అంటూ జగన్ చేసిన ప్రచారం కూడా జనం నమ్మారు. పాతికకు ఇరవై రెండు ఎంపీ సీట్లు వైసీపీకి కట్టబెట్టారు. 175కు 151 ఎంఎల్ఏ సీట్లు ఇచ్చారు.

ఇక, రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఖాయమని జనం అనుకున్నారు. అయితే, ఇక్కడ వైసీపీ గెలిచినట్టే.. ఢిల్లీలో మోదీ పూర్తి మెజారిటీతో రెండోసారి గెలిచారు. దాంతో, జగన్ గట్టిగా అడిగే పరిస్థితి లేకుండాపోయింది.

ఏతా... వాతా ఇక ప్రత్యేకహోదా అనేది ముగిసిన అధ్యాయంగా మారిపోయింది. జగన్ ఢిల్లీ వెళ్లి వచ్చినప్పుడల్లా ప్రధానిని ప్రత్యేకహోదా ఇవ్వాలని కోరారు అంటూ ముక్తాయించడమే తప్ప, ఒక ప్రత్యేక కార్యాచరణ అనేది లేకుండాపోయింది.

ఈ పూర్వ రంగంలో 17వ తేదీన ఆంధ్ర, తెలంగాణ ఆర్థికశాఖల ముఖ్యకార్యదర్శులతో కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ చర్చిస్తారంటూ ఢిల్లీ నుంచి ఒక అధికారిక ప్రకటన వెలువడింది.

ఇందులో పెద్ద విశేషం ఏమీ లేకపోయినా.. 'ప్రత్యేకహోదా' అంశం కూడా ఎజెండాలో చేర్చారు. దీంతో, అటు వైసీపీలోనూ ఇటు రాష్ట్రంలోనూ ఆనందోత్సవాలు ఒక్కసారిగా వెల్లివిరిశాయి. జగన్ ప్రతిభ, పలుకుబడి కారణంగానే కేంద్రం దిగివచ్చిందని వైసీపీ నేతలు ఇల్లెక్కి చాటింపు వేస్తే మొత్తం మీద ఇన్నాళ్లకయినా తెలుగువారి కల నెరవేరుతుందని ప్రజలు అమితానంద భరితులు అయ్యారు.

ఈ ఆనందం రెండు గంటలు కూడా నిలవలేదు.

కేంద్రం జారీచేసిన అధికారిక ఎజెండాలో నుంచి ప్రత్యేక హోదా అంశాన్ని తొలగిస్తూ కేంద్ర హోంశాఖ మరో నోటీసు జారీ చేసింది. దీంతో వైసీపీ నేతలు బిక్కచచ్చిపోతే, ప్రజలు ఖిన్నులయ్యారు.

రాష్ట్రంలో దాదాపుగా అందరూ మరిచిపోయినట్లుగా భావిస్తున్న ప్రత్యేకహోదా పుండును కేంద్రం కెలికిందనే భావనలు వ్యక్తమవుతున్నాయి. 2019 ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదా అనేది చంద్రబాబు వల్ల కాదులే అని జనం భావించిన రీతిలోనే ప్రత్యేకహోదా అనేది జగన్ వల్ల కూడా కాదులే అని 2024 ఎన్నికల నాటికి జనం భావించే ప్రమాదం వైసీపీకి కళ్లెదురుగా ఉంది.

అప్పుడే టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రనాథ్ అందుకున్నారు. 'మీ వల్ల కాకపోతే, ఆ విషయం చెప్పండి. మా కార్యాచరణ ప్రకటిస్తాం...' అని వైసీపీకి సవాలు విసిరారు. 'మీరు కార్యాచరణ మొదలుపెట్టండి. మీ వెనకాల మేము నడుస్తాం..' అంటూ కవ్వించారు కూడా.

మొత్తం మీద, 'ప్రత్యేకహోదా'ను కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లో సెంటర్ స్టేజ్‌కి తీసుకువచ్చేసింది. ఒక్కటి మాత్రం స్పష్టం. మోదీ ప్రధానిగా కొనసాగినంతకాలం, ఆంధ్రకు ప్రత్యేకహోదా మంజూరు చేయించడానికి ముఖ్యమంత్రి జగన్ అమితంగా కష్టపడాలి. లేకపోతే, టీడీపీ రంగంలోకి దిగుతోంది.

2019 ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు చేపట్టిన నల్ల చొక్కాలు ధర్మాగ్రహం అనేది ఓటర్లలో భావోద్వేగ అంశంగా మారలేదు గానీ అంతమంది ఎంపీలు, ఎంఎల్ఏలను ఇచ్చినా జగన్ కూడా ప్రత్యేకహోదా తేలేకపోయారు అనేది భావోద్వేగ ఎన్నికల అంశం అయి కూర్చుంటుంది.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

## రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడిగా
## గిద్దలూరు రాధాకృష్ణారెడ్డి

గూడూరు ధూర్జటినగర్‌లోని శుభమస్తు కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం నెల్లూరుజిల్లా అధ్యక్షులుగా గిద్దలూరు రాధాకృష్ణారెడ్డిని ఎన్నుకోవడం జరిగిందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంగలకుంట నరేష్‌రెడ్డి ఇటీవల తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుండి పలువురు రెడ్డి ప్రముఖులు హాజరవగా, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నరసింహారెడ్డి, డి.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## గూడూరును ఇక్కడే ఉంచండి



ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న అఖిలపక్షం నాయకులు

గూడూరును బాలాజీ జిల్లాలో కలపడం సరికాదని, గూడూరును నెల్లూరుజిల్లాలోనే కొనసాగించాలని, లేదా గూడూరును జిల్లాగా ప్రకటించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఆ మేరకు అఖిలపక్షం నాయకులు ఈ నెల 15వ తేదీ గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావుకు ఆయన నివాసంలో వినతిపత్రం సమర్పించారు. తెలుగుదేశం, సిపిఐ, ఎస్సీ & ఎస్టీ సెల్, బహుజన సమాజ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**ఆర్డీవో మురళీకృష్ణ**



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో మురళీకృష్ణ ఈ నెల 14వ తేదీ 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించి, డివిజన్‌లోని వలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల వద్ద వినతులు స్వీకరించారు. అనంతరం ఆర్డీవో ఆయా ప్రాంతాల్లోని ఆర్ఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. గూడూరును నెల్లూరులోనే కొనసాగించాలని కొంతమంది అర్జీదారులు కోరారు.

## మహిళలకు రోటరీ 'చేయూత'



రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే 'చేయూత' కార్యక్రమం క్లబ్ అధ్యక్షుడు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 14న జరిగింది. చేయూత ద్వారా ప్రతి నెల 15 మంది నిరుపేద మహిళలకు వెయ్యి రూపాయలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందించడం జరుగుతోందని, ఈ కార్యక్రమానికి దాతలుగా సుదర్శన్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి వ్యవహరించారని ఈ సందర్భంగా రాఘవరెడ్డి తెలిపారు. టౌన్ ఎస్ఐ తిరుపతయ్య ముఖ్యఅతిథిగా హాజరవగా, సెక్రటరీ ధనుంజయరెడ్డి, సీనియర్ జిల్లా సెక్రెటరీ శ్రీకాంత్ రెడ్డి, వాసుగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, బలరాంరెడ్డి పాల్గొన్నారు

## ఐపిఓకి వ్యతిరేకంగా ఎల్ఐసి ఉద్యోగులు



ఈ నెల 14న ఐపిఓకి వ్యతిరేకంగా ఎల్ఐసి ఉద్యోగులు నినాదాలు చేశారు. భోజన విరామ సమయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచి ఐసిఈయు అధ్యక్షులు డి.బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వానికి లాభాలు తెచ్చిపెడుతున్న ఎల్ఐసిని షేర్‌మార్కెట్‌లో పెట్టడం దారుణమైన విషయమన్నారు. ఐసిఈయు కార్యదర్శి ఎన్.శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం తగదన్నారు. అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ డి.జనార్ధన్ మాట్లాడుతూ ఎల్ఐసి ప్రభుత్వ రంగ సంస్థ కాబట్టి వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వమే తీసుకొని పంచవర్ష ప్రణాళికలో పెట్టుబడి పెడుతుందని, అదే ప్రైవేటుపరం చేస్తే షేర్ హోల్డర్లకి పంచిపెట్టాల్సి వస్తుందని తెలిపారు.

# వాకర్స్ ఆధ్వర్యంలో.. ఉచిత వైద్యశిబిరం



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న స్టేడియంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వాకర్స్ సభ్యులకు ఉచిత వైద్యపరీక్షలు చేశారు. వారికి ఆరోగ్యసలహాలిచ్చారు. అవసరమైనవారికి ఉచితంగా మందులిచ్చారు. సన్ డయాబెటిక్ ల్యాబొరేటరీ వారి సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు కనకట్ల రఘురాం ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు బాసం శేషగిరిరావు, కిలారి తిరుపతినాయుడు, వింజం రామానాయుడు, దాసరి అనంతరామారావు, వేలూరు రంగారావు, తలారి బాలసుధాకర్, రాఘవేంద్రషెట్టి, గోపీనాథ్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలను జడ్పీ హైస్కూళ్లలో కలపొద్దు

## దళిత సంఘర్షణ సమితి ధర్నా

పాఠశాలలను జడ్పీ హైస్కూళ్లలో కలపొద్దంటూ దళిత సంఘర్షణ సమితి ప్రతినిధులు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో 3 నుంచి 5వ తరగతి వరకు జడ్పీ హైస్కూళ్ళలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 14న నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద దళిత సంఘర్షణ ప్రతినిధి ఎస్.మల్లి ఆధ్వర్యంలో ధర్నాందోళన చేశారు. పల్లెల్లో ప్రాథమిక పాఠశాల అసౌకర్యాల కొరతలో ఉన్నాయంటూ నాడు-నేడు పథకం ద్వారా స్కూళ్ళను అభివృద్ధిచేస్తున్న ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా అక్కడ తరగతులే లేకుండా చేయడం ఏమిటని ప్రశ్నించారు. దూరప్రాంతాల్లో ఉండే జడ్పీ హైస్కూళ్ళకు గ్రామాల్లో ఉండే నిరుపేద విద్యార్థులు వెళ్ళి చదువుకోవాలంటే ఎంతో ఇబ్బందిగా ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ అధికారులకు అందజేశారు.

# ఉదయగిరిని జిల్లా చేయండి

## సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి

ఉదయగిరికి తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, రవాణా సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కావాలంటే ఉదయగిరి జిల్లా కావాలని, వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి కావాలంటే ఉదయగిరిని జిల్లా కేంద్రం చేయాలని ఉదయగిరి జిల్లాసాధన కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి అహమ్మద్ పేర్కొన్నారు. ఆమేరకు గోడలపై రాస్తూ ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాన్ని ఆయన చేపట్టినట్లు తెలిపారు. దాదాపు రెండేళ్ళ నుంచి ఉదయగిరి జిల్లా సాధన కోసం అనేకరకాలుగా పోరాటాలు చేస్తూనే ఉన్నామని, ఇకనైనా ప్రభుత్వం పరిశీలించి ఉదయగిరిని జిల్లాగా చేయాలని ఆయన కోరారు.

## అక్షర కేంద్రాలను

# సద్వినియోగం చేసుకోవాలి

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటుచేస్తున్న అక్షర కేంద్రాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని మండల కేంద్రమైన కోట బిట్-2 ఎంపిటిసి సభ్యుడు షేక్ మొబిన్ బాషా, సర్పంచ్ వెంకటరమణమ్మ కోరారు. ఈనెల 13న కోటలోని శ్రీలక్ష్మి గిరిజనకాలనీలో అక్షరభారత్-అక్షర వెలుగు విద్యాప్రాజెక్టు శిక్షణా కేంద్రాన్ని వారు ప్రారంభించారు. చదువుతోనే జీవితాలకు వెలుగు వస్తుందన్నారు. మండల కో-ఆర్డినేటర్‌లు ఏ.సుబ్రహ్మణ్యం, జి.విజయలక్ష్మితో పాటు పలువురు గ్రామ కో-ఆర్డినేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కన్నులపండువగా..

# శివపార్వతుల కల్యాణం

కోట మండలం, మద్దాలి గ్రామంలోని శ్రీ శివకోటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 14న శివ పార్వతుల కల్యాణమహోత్సవం కన్నుల పండువగా జరిగింది. తొలుత స్వామివారిని, అమ్మవారిని పూలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా శివ పార్వతులకు కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వాహనంపై కొలువుదీర్చి వైభవంగా గ్రామోత్సవం చేశారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. వైకాపా కేంద్రకమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొడవలూరు ధనుంజయరెడ్డి, సర్పంచ్ వాణమ్మ, పచ్చా శివరామనాయుడు తదితరులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

# విడవలూరు కాలేజీకి డిసిఎమ్మెస్ విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న డిసిఎమ్మెస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు

విడవలూరులోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ల కొనుగోలుకు 5 లక్షల రూపాయలను డిసిఎమ్మెస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు విరాళంగా అందజేశారు. ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలకు కళాశాలలోని కంప్యూటర్లు తడిసిపోయాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసుకునేందుకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనతో, డిసిఎమ్మెస్ బోర్డు సభ్యుల తీర్మానంతో ఈ విరాళం అందించామని ఆయన చెప్పారు. నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న డిసిఎమ్మెస్ కార్యాలయంలో విరాళం చెక్కును కళాశాల ప్రిన్సిపాల్ సుజాతకు ఆయన అందజేశారు. డిసిఎమ్మెస్ డైరెక్టర్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి

## జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యుడు అరవ పార్వతయ్య



గూడూరుకు చేరుకున్న జ్ఞానయుద్ధ యాత్రకు స్వాగతం పలుకుతున్న దళిత బహుజన సంఘాల నాయకులు

కరెన్సీ నోట్లపై భారతరత్న, భారత రాజ్యాంగనిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఫోటోను ముద్రించాలంటూ అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు పరశురామ్, జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యులు అరవ పార్వతయ్య, డివిజన్ అట్రాసిటీ కమిటీ సభ్యులు దాసరి వెంకటేశ్వర్లు తదితరులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ సాధన కోసం ఈనెల 5న ఇచ్ఛాపురం నుంచి జ్ఞానయుద్ధ యాత్ర ప్రారంభమైందన్నారు. ఈ యాత్ర ఏప్రిల్ 14న ఢిల్లీకి చేరుకుంటుందన్నారు. ఈనెల 13న గూడూరులోని అంబేద్కర్ విగ్రహం వద్దకు యాత్ర చేరుకున్న సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె నుంచి ఢిల్లీ దాకా ఈ యాత్ర చేపట్టామన్నారు. మాలమహానాడు డివిజన్ అధ్యక్షుడు దాసరి కృష్ణ, దళిత బహుజన సంఘాల నాయకులు యాత్రకు స్వాగతం పలికారు.

# కోరిన వరాలిచ్చే 'నెల్లటూరు' చంద్రమౌళీశ్వరుడు

*'బ్రహ్మ మురారి సురార్చిత లింగం*
*నిర్మల భాసిత శోభిత లింగం*
*జన్మజ దు:ఖ వినాశక లింగం*
*తత్ప్రణమామి సదాశివ లింగం'..*

అంటోంది లింగాష్టకం. దేవతలే పూజించుకున్న ఆ మహాదేవుని లింగరూపం భక్తలోకానికి ఒక వరం. జన్మజన్మల దు:ఖాలను, సంచిత పాపకర్మలను, సకల పాపాలను పరిహరించే దేవుడు ఆ సదాశివుడు. అన్నిరకాల కష్టనష్టాలను తీర్చి, ఆపదల నుంచి గట్టెక్కించి భక్తులకు కొంగుబంగారంలా నిలిచే భక్తసులభుడు ఆ పరమేశ్వరుడు. అంతేకాదు, కోరినంతనే వరాలనిచ్చే కొండంత దేవుడు.. భోళాశంకరుడని ప్రతీతి. చేతులెత్తి ప్రణమిల్లితే చాలు.. అండగా నేనున్నానంటూ అభయమిచ్చే భక్తవరదుడు.. శంకరుడు. ఆ మహాదేవుని మనసారా భక్తితో తలచుకుంటే చాలు జీవితాలు ధన్యమవుతాయి. అంతటా తానై సర్వాంతర్యామిగా నిలిచి ఉండే ఆ పరమేశ్వరుడు అనేక పేర్లతో, అనేక రూపాలతో అనాదిగా భక్తుల కొంగుబంగారంగా అనేక క్షేత్రాల్లో కొలువై పూజలందుకుంటున్నాడు. కాలక్రమేణా ఎందరో భక్తులు కూడా పరమశివునిపై నిండుభక్తితో ఆలయాలు నిర్మించి భక్తితో పూజలు చేసుకుంటూ, ఆయా ప్రాంతాల్లో దైవభక్తిని పెంపొందిస్తూ తమ జీవితాలను ధన్యం చేసుకుం టున్నారు. అలా వెలసిన మరో భవ్యక్షేత్రమే 'నెల్లటూరు' గ్రామంలోని బాలాత్రిపురసుందరీ దేవి సమేత శ్రీ చంద్ర మౌళీశ్వరస్వామి దేవాలయం.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని గూడూరు పట్టణం సమీపంలో, కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో నెల్లటూరు గ్రామం ఉంది. గూడూరు నుంచి వెంకటగిరికి వెళ్ళే దారిలో గోగినేనిపురం దాకా వెళ్తే అక్కడికి కొద్ది దూరంలోనే ఈ ఆలయం కనిపిస్తుంది. గూడూరు నుంచి నెల్లటూరుకు బస్సులు, ఆటోల సౌకర్యం కూడా ఉంది.








### శివభక్తులు కట్టించిన కోవెల :

నెల్లటూరులో పూర్వకాలం నుంచి భక్తులకు కొంగుబంగారంగా ప్రాచీనమైన శివాలయం ఉండేది. లింగాకారుడైన పరమశివునికి అక్కడ అనునిత్యం పూజలు జరుగుతుండేవి. కాలక్రమంలో ఆలయం శిథిలావస్తకు చేరుకోవడంతో ఓ పాతికేళ్ళ కిందట ఆ గ్రామ వాస్తవ్యులు..శివభక్తులైన కందనూరు సూరిబాబు (ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు), ఆయన సోదరులు రమణయ్య, చిట్టిబాబు తదితరుల ఆధ్వర్యంలో, గ్రామస్తుల సహకారంతో తమకున్న విశాలమైన స్థలంలో అత్యద్భుతమైన రీతిలో ఆ మహాదేవునికి ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రాకారం, ధ్వజస్తంభంతో పాటు గర్భాలయంలో లింగాకార రూపంలో ఉన్న చంద్రమౌళీశ్వరుడు, ఆ పక్కనే బాలాత్రిపురసుందరిదేవి అమ్మవారి మందిరం నిర్మించారు. ఈ శివాలయానికి బాలాత్రిపురసుందరిదేవి సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంగా నామకరణం చేశారు. ఈ ఆలయానికి వారే నిర్వాహకులుగా, దాతలుగా ఉంటూ పరమశివునిపై పరమభక్తితో అనేక కైంకర్యాలు చేస్తున్నారు. అనేకమంది గ్రామస్తులు ఉభయకర్తలుగా ఉంటూ స్వామివారిని సేవించుకుంటున్నారు. పూర్వకాలం నాటి శివలింగాన్ని కూడా ఆలయంలోనే భద్రపరిచారు. ఆ స్థానంలోనే కొత్తగా రూపుదిద్దుకున్న ఈ ఆలయ ప్రాంతమంతా చుట్టూ పచ్చని పొలాలతో కనువిందుగా ఉంటుంది. ఆలయ ప్రాంగణమంతా వివిధ దేవతామూర్తుల మందిరాలతో ఎంతో కళగా ఉంటుంది. నవగ్రహాల మందిరం, నాగశిలల మండపం, వినాయకుని గుడి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మందిరాలను కూడా నిర్మించి నిత్యం పూజలు చేస్తున్నారు. ఇటీవల కాలభైరవుడు, నందీశ్వరుడు, చండీశ్వరుల విగ్రహమూర్తులను కూడా ఆలయప్రాంగణంలో సర్వాంగసుందరంగా నిర్మాణం గావించారు. బ్రహ్మదేవుడికి కూడా ఇక్కడ మందిరం కట్టి పూజలు చేయడం ప్రత్యేకత.

### వైభవంగా.. మహాశివరాత్రి ఉత్సవాలు :

గర్భాలయంలో లింగాకారంలో కొలువై ఉన్న పరమశివునికి, ఆ చెంతనే ఉన్న మందిరంలో బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారికి నిత్యపూజలు జరుగుతుంటాయి. పండుగలు, ప్రత్యేకమైన రోజుల్లో స్వామివార్లకు విశేషపూజలు చేస్తుంటారు. ప్రతి సోమవారం అమ్మవారికి విశేషంగా క్షీరాభిషేకాలు, కుంకుమపూజలు జరుగుతుంటాయి. కార్తీకమాసంలో ఆలయమంతా కార్తీక దీపకాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోతుంటుంది. అందులోనూ మహాశివరాత్రి పర్వదినం వస్తే చాలు..ఆలయం మరింత శోభాయమానమైన అలంకారాలతో కళకళలాడుతుంటుంది. శివరాత్రి రోజున స్వామివారికి, అమ్మవారికి ఆలయ అర్చకులు పెద్దఎత్తున పూజలు, అభిషేకాలు చేసి శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కూడా ఎంతో వైభవంగా నిర్వహిస్తుంటారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేయడం ఎంతోకాలం నుంచి ఆనవాయితీ.

# కల్యాణ వైభవం...!




కలివెలపాళెం వాస్తవ్యులు చెన్నారెడ్డి రమేష్‌రెడ్డి - జ్యోతిర్మయిల కుమార్తె
**ధామిని - ప్రణీత్‌కుమార్‌రెడ్డి**ల కల్యాణం ఫిబ్రవరి 10వ తేదీ వైభవంగా జరిగింది.
వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# తూచ్..! హోదా లేదు.. గీదా లేదు

(మొదటి పేజీ తరువాయి)

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృత సమస్యలపై చర్చించేందుకు కేంద్రం కొత్తగా నియమించిన కమిటీ ఎజెండాలో 'ఆంధ్రప్రదేశ్‌కు స్పెషల్ స్టేటస్' అంశాన్ని కూడా పొందుపరుస్తూ ముందు ఒక నోట్ జారీచేశారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. మోడీ మనసు మారిందా...? అన్న సంభ్రమాశ్చర్యాలకు జనం లోనయ్యారు. వైసీపీ శ్రేణులు ఒకడుగు ముందుకేసి ఇది తమ నాయకుడు జగన్ సాధించిన ఘన విజయంగా ప్రకటనలు కూడా ఇచ్చేశారు. కానీ, ఒకటి రెండు గంటల వ్యవధిలోనే కేంద్రం నాలుక మడతేసింది. 'తూచ్ ...! ప్రత్యేకహోదా అంశం ఎజెండాలో లేదు అంటూ అదేరోజు సాయంత్రానికి మరో నోట్‌ను విడుదల చేశారు. ఈ పరిణామానికి ఖంగుతిన్న ఆంధ్రులు ఒక్కసారిగా అసహనానికి గురయ్యారు. ఏపీలో బీజేపీ ఆత్మరక్షణలోకి జారిపోయింది. దాంతో జనం దృష్టిని అర్జెంటుగా మరో అంశం మీదకు మళ్లించడం కోసం వివేకానందరెడ్డి హత్య కేసు ఛార్జిషీట్‌ను బయటికి తీసి దాని దుమ్ముదులిపి తాజాగా మీడియా సంస్థలకు పంచిపెట్టారా...? అన్న అనుమానం ఇప్పుడు రాజకీయ విశ్లేషకులనుండి బలంగా వినపడుతోంది. ప్రత్యేకహోదా అంశం మరుగునపడి, ప్రస్తుతం అవినాష్ అంశమే ప్రజలలో పెద్ద చర్చనీయాంశంగా మారిపోయింది.

వై.యస్.వివేకానందరెడ్డి హత్య కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ గత ఏడాది అక్టోబర్ 26న ప్రాథమిక ఛార్జిషీట్‌ను పులివెందుల కోర్టులో దాఖలు చేసింది. నలుగురు వ్యక్తులపై నేరారోపణ చేస్తూ దాఖలు చేసిన ఈ ఛార్జిషీట్‌లోని అంశాలు... నాలుగు నెలల తరువాత ఇప్పుడు మీడియాకు లీక్ అవడం విడ్డురమే.

'లీక్' మాత్రమే కాదు. టైపు చేసివున్న ఛార్జిషీట్‌ను కొన్ని టీవీ చానెల్స్ లైవ్‌లో కూడా ప్రదర్శించాయి. అందులోని కథనాన్ని పూసగుచ్చినట్టుగా పదే పదే ప్రసారం చేశాయి. వాటికి ఆ ఛార్జిషీట్ ప్రతులు 'వడ్డించిన విస్తరి'లా లభించాయి కాబట్టి, అవి ప్రసారం... ప్రచారం కూడా చేశాయి. వాటిని ఇప్పుడు తప్పుపట్టాల్సిన పని లేదు.

అయితే, ఛార్జిషీట్ దాఖలు చేసిన ఇన్నాళ్ళకు దానిని మీడియా సంస్థలకు 'రహస్యంగా'గా అందించాల్సిన అవసరం ఎవరికి వుంది...? ఇదే ఇప్పుడు సమాధానం దొరకని ప్రశ్న.

దర్యాప్తు సంస్థలు తాము దాఖలు చేసే చార్జిషీట్ లోని అంశాలను మామూలుగా మీడియాకు యధాతథంగా లీక్ చెయ్యవు. కానీ, ఈ కేసులో మాత్రం ఛార్జిషీట్ ప్రతులనే మీడియా చేతికి చేర్చాయి.

నిజానికి ఈ ఛార్జ్ జెరాక్స్ ప్రతులను సీబీఐ అయినా మీడియాకు అనధికారికంగా ఇచ్చి ఉండాలి.. లేదా కోర్టు నుంచి బయటకు వచ్చి ఉండాలి. కాదంటే, నిందితుల తరఫు న్యాయవాదులైనా బయటపెట్టి ఉండాలి. తమ క్లయింట్లు అల్లరిపాలు కావాలని న్యాయవాదులు భావించరు కాబట్టి వారివైపు నుండి అవకాశమే లేదు. న్యాయస్థానం నుంచి లీక్ అయ్యే ప్రసక్తే ఉండదు. ఇకపోతే సీబీఐ. సీబీఐ కూడా ఛార్జిషీట్‌ను దాఖలుచేసిన తరువాత ఇప్పుడు, లోకల్‌గా లీక్ చేసుండొచ్చని అనుకోడానికి లేదు. సిబిఐ అన్నది ఒక విశ్వసనీయ దర్యాప్తుసంస్థ.

ఇలాంటి కేసులు దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ఉంటాయి. ఈ అంశాలన్నీ దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే 'పై'అధికారుల వ్యూహంలో భాగంగా ఈ ఛార్జిషీట్ కాపీలను స్థానిక మీడియా సంస్థలకు లోకల్ సీబీఐ అధికారులు అందించారా అనే సందేహాలు మేధావులలో వెల్లువెత్తుతున్నాయి. ఆ 'పై'అధికారులకు కూడా తమంతట తాముగా ఈ నిర్ణయం తీసుకునే అవసరం గానీ, అవకాశం గానీ కనపడడం లేదు. కేంద్రంలోని రాజకీయ నాయకత్వం నుంచి పైఅధికారులకు అక్కడినుంచి రాష్ట్రంలోని క్రింది అధికారులకు ఉప్పు అందివుండొచ్చేమోనని కొంతమంది విశ్లేషకుల అభిప్రాయం.

రాష్ట్ర ప్రజల దృష్టిని ఇప్పుడు ఇంత అర్జెంట్‌గా వివేకానందరెడ్డిపైకి మళ్లించాల్సిన అవసరం హఠాత్తుగా కేంద్ర పెద్దలకు ఎందుకొచ్చిందన్న ప్రశ్నకు సమాధానం... హోదా వివాదమే అన్న మాట సర్వత్రా వినపడుతోంది. వివేకానందరెడ్డి కేసు తెరపైకి తెచ్చి, ఛార్జిషీటులో అవినాష్‌రెడ్డికి ప్లేసు కల్పించి, తాత్కాలికంగా హోదా ఊసు లేకుండా చేయాలన్నది అసలు వ్యూహం అన్న అభిప్రాయం విభిన్న వర్గాలలో వ్యక్తమవుతోంది.

# కారుణ్య నియామకాలను పూర్తిచేయండి - కమిషనర్

నెల్లూరు నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తూ కోవిడ్ బారినపడి మృతిచెందిన సిబ్బంది కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాల నియామక ప్రక్రియను వెంటనే పూర్తిచేసి వారిని విధుల్లోకి తీసుకోవాలని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈనెల 15న ఆయన తన కార్యాలయంలో అధికారులతో సమావేశమై కార్పొరేషన్‌లోని రెగ్యులర్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ కరోనాతో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలకు ఉద్యోగభద్రత కల్పించాలని సూచించారు.

# దారులు వేరైనా.. గమ్యం ఒకటే!



## భగవత్ రామానుజుల బోధనలు మార్గదర్శకం

**- 'సమతామూర్తి' ప్రాంగణంలో..శాంతా బయోటెక్నిక్స్ అధినేత కెఐ వరప్రసాద్‌రెడ్డి**

*హైదరాబాద్‌లోని ముచ్చింతల్‌లో ఏర్పాటైన భగవత్ రామానుజుల భారీ విగ్రహాన్ని ఇటీవల శాంతా బయోటెక్నిక్స్ అధినేత, సమాజ సేవాపరాయణుడు, సాహితీప్రియుడు కెఐ వరప్రసాద్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ చిన్నజియ్యర్‌స్వామివారి ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన భగవత్ రామానుజుల వారి జీవిత ప్రస్థానం గురించి, వెయ్యేళ్ళ క్రితమే నాటి సమాజంలో రామానుజుల వారు సమాజ చైతన్యం కోసం ఉద్యమించిన తీరు గురించి అద్భుతంగా ప్రసంగించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. అనంతరం శ్రీ త్రిదండి చిన్నజియ్యర్‌స్వామి వారు మాట్లాడుతూ 'రామానుజులవారి జీవితశైలి గురించి వరప్రసాద్‌రెడ్డి చాలా చక్కగా వివరించారంటూ' అభినందించారు కూడా.*

భగవంతుడిని చేరుకునేందుకు ఎన్నో దారులున్నాయని, దారులు వేరైనా గమ్యం ఒకటేనని, భగవంతుడు అందరివాడని వెయ్యేళ్ళ క్రితమే కులమతాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన మహనీయుడు, సనాతన ధర్మపరిరక్షకుడు భగవత్ రామానుజులవారని ఈ కార్యక్రమంలో ప్రసంగించిన వరప్రసాద్‌రెడ్డి అన్నారు. రామానుజుల వారి జీవిత విశేషాలను ఆయన వివరిస్తూ.. రామానుజుల వారి విశిష్టాద్వైతం ఎంతో విశిష్టమైనదని, గొప్ప మానవతావాద దృక్పథం, సాహసప్రవృత్తులకు రామానుజులవారొక ప్రతీక అని కొనియాడారు. వెయ్యేళ్ళ క్రితమే.. నాటి సమాజంలో ఛాందసభావాలు ముమ్మరంగా ఉన్న రోజుల్లో సమాజ చైతన్యం కోసం, సంస్కరణల కోసం విప్లవించిన చైతన్యమూర్తి రామానుజులవారని అన్నారు. ప్రతి యుగంలోనూ పాండవుల కంటే కౌరవులే ఎక్కువగా ఉంటారని, మంచికి అడ్డుగా ఉంటుంటారని, అలాంటి పరిస్థితులన్నిటినీ అధిగమించి ధర్మాన్ని పరిరక్షించాలనే ఏకైక ధ్యేయంతో భగవత్ రామానుజుల వారొక సామాజిక విప్లవకారునిగా నిలిచి సమాజానికి వెలుగుబాటలు పరిచారన్నారు. తన 32వ ఏట సంసారిగా ఉంటూ, తన సంస్కరణోద్యమంలో భాగస్వామిని కాలేని తన జీవితభాగస్వామిని సైతం త్యజించి మంచిని నిలబెట్టడానికి, ధర్మాన్ని పరిరక్షించడానికి సాహసోపేతమైన రీతిలో ఉద్యమించిన గొప్ప ఆధ్యాత్మికవేత్త రామానుజులవారని ప్రశంసించారు. రామానుజులవారంటే పట్టుదలకు మారుపేరని, అయితే ఆ పట్టుదల కూడా సమాజశ్రేయస్సు కోసమేనని అంటూ, గురువుల నుంచి ఉపదేశం పొందేందుకు 18 పర్యాయాలు ప్రయత్నించి, గురువులను మెప్పించి వారి నుంచి ఉపదేశం పొంది, ఆ ఉపదేశ సారాన్ని ప్రజలందరికీ బోధించిన మహానుభావుడు..భగవత్ రామనుజులవారని అన్నారు. వారెవరితో వాదన చేసినా వాదనా పటిమతో వారిని గెలుచుకున్నారే తప్ప వారిని ఓడించలేదని, ఎదుటివారిని మెప్పించి వారిని తనవైపు తిప్పుకునే ఆయన మంచిమనస్తత్వం, విశిష్టవ్యక్తిత్వం అపూర్వమని అన్నారు. ఇప్పటికాలంలో వలె ఆయనెప్పుడూ ఓట్లనో, ఏ పదవులనో ఆశించలేదని, తాను నమ్మిన సిద్ధాంతాల కోసమే నిలబడ్డారని, సమాజంలో సమత కోసం సమైక్యత కోసం జీవితాన్నంతా వెచ్చించారని అన్నారు. కులమత వర్గ భేదాలు వద్దని, మానవులంతా కూడా ఒకటేనని వారు బోధించారని, సమాజంలో అందరినీ సమానంగా చూడాలని కోరుకున్నారని, స్త్రీలు చదువుకోకూడదనే నాటి రోజుల్లో స్త్రీ-పురుష అనే వివక్ష కూడా లేకుండా, స్త్రీలు కూడా చదువుకోవాలని చాటిన సమాజ వైతాళికులు..భగవత్ రామనుజులవారని ఆయన కీర్తించారు. రామానుజుల వారు రచించిన 'శ్రీ భాష్యం' వంటి ఉద్గ్రంథాలు ఎంతో అద్భుతమైనవని, అలాంటివి తెలుగువారు కూడా చదువుకునేందుకు వీలుగా తెలుగులో ముద్రించాలని, ఆ అవకాశాన్ని తనకు ప్రసాదించాలని కూడా వరప్రసాద్‌రెడ్డి ఈ సందర్భంగా కోరారు.

### ఉద్యోగుల కుటుంబాలకు..

# 20 లక్షల ఎక్స్‌గ్రేషియా




వెంకటేష్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్

గత ఏడాది నవంబర్‌లో భారీవర్షాలు వరదల్లో విధులు నిర్వహిస్తూ ఇద్దరు మృతి చెందగా వారి కుటుంబాలకు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈనెల 16న 20 లక్షల రూపాయల వంతున ఎక్స్‌గ్రేషియాను అందజేశారు. యల్లాయపాళెం వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్ వెంకటేష్ వరదల్లో చిక్కుకుని మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులకు ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా చెక్కును కలెక్టర్ అందించారు. అదేవిధంగా విజయనగరం జిల్లాకు చెందిన ఎస్‌డిఆర్‌ఎఫ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు దామరమడుగు వద్ద వరదలో చిక్కుకుపోయిన వారిని కాపాడుతుండగా లైఫ్‌జాకెట్ ఊడిపోవయి ప్రవాహంలో మరణించిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కును విజయనగరం 9వ బెటాలియన్ ఆర్‌ఎస్‌ఐ బోస్‌కు అందించి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు చెక్కు అందేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### కలివేలమ్మతల్లి సేవలో..

## వెంకటగిరి మునిసిపల్ ఛైర్‌పర్సన్



అమ్మవారికి పూజలు చేస్తున్న మునిసిపల్ ఛైర్‌పర్సన్ భానుప్రియ

వెంకటగిరిలో వెలసివున్న గ్రామ దేవత శ్రీ కలివేలమ్మ అమ్మవారికి ఈనెల 13న విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగిరి మునిసిపల్ ఛైర్‌పర్సన్ భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు సతీమణి, వారి కుటుంబసభ్యులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. 17వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు తీర్చాలంటూ.. విఆర్‌ఏల రిలే దీక్షలు




గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న తమ సమస్యలను తీర్చాలంటూ పలువురు విఆర్‌ఏ (విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్)లు ఈనెల 13న ఆత్మకూరు తాలూకాఫీసు వద్ద రిలే నిరాహార దీక్షలు చేశారు. విఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు నిజమాల నారాయణ, మహేష్, సిహెచ్ బాబు, శ్రీనివాసులు, పెంచలప్రసాద్ ఈ దీక్షల్లో పాల్గొన్నారు. విఆర్‌ఏలకు కనీస వేతనంగా రూ. 21 వేలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మార్చి 10న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు ఈ సందర్భంగా విఆర్‌ఏలకు పిలుపునిచ్చారు.

### శ్రీ చాముండేశ్వరి అమ్మవారికి

## పూలంగిసేవ

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో కొలువైవున్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారికి ఈనెల 13న ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి నేత్రపర్వంగా పూలంగిసేవ నిర్వహించారు. ఆలయ అర్చకుడు మాచవోలు రామకృష్ణ, నూతలపాటి అనిల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ కృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

## పోలీసులకు ఉద్యోగోన్నతి

జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న అయిదుగురు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా, ముగ్గురు మహిళా కానిస్టేబుళ్ళకు ఏఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు ఇటీవల ఆదేశాలిచ్చారు. విసిహెచ్ సుబ్రహ్మణ్యం (దర్గామిట్ట), ఎల్.రామకోటేశ్వరరావు, షేక్ మహబూబ్‌బాషా(డిఎస్‌బి), పి.రామకృష్ణుడు (డిసిఆర్‌బి), ఎం.జ్ఞానశేఖర్ (సూళ్ళూరుపేట)లు ఎస్‌ఐలుగా, పి.రాధ (తడ), బి.కృష్ణవేణి (దిశ), పి.పద్మశ్రీ (పొదలకూరు)లు ఏఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి పొందారు.

### ప్రభుత్వ మద్యం షాపులను దోచేసే..

## దుండగులు దొరికారు

- 45చోరీలు చేసి.. ఇద్దరిని చంపేసిన దోపిడీ ముఠాను నెల్లూరు పోలీసులు పట్టుకున్నారు
- పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నారు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డిఐజి త్రివిక్రమవర్మ, జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు

***ఆరుజిల్లాల్లో చోరీలు చేసి, అడ్డొచ్చిన ఇద్దరని హతమార్చి, దాదాపు 95 లక్షల దాకా దోచుకుపోయి గత రెండేళ్ళుగా తప్పించుకు తిరుగుతున్న గజదొంగల ముఠాను ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ విజయారావు సారధ్యంలో ఈ ముఠా ఆట కట్టయింది. రాష్ట్రవ్యాప్తంగా పోలీసుశాఖకే సవాల్‌గా మారిన ఈ దుండగులను పట్టుకుని నెల్లూరు జిల్లా పోలీసులు తమ సత్తా చాటుకున్నారు. కేవలం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మాత్రమే చోరీలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ దొంగల ముఠాలోని ఏడుగురిని అరెస్ట్ చేశారు. నిందితులంతా ప్రకాశం జిల్లాకు చెందిన వారని, వీరి ముఠాలో మరో ఏడుగురు ఉన్నారని తెలుస్తోందని, కీలక నిందితుడైన మహేష్‌తో పాటు, మిగిలిన వారిని కూడా పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను పంపామని డిఐజి త్రివిక్రమవర్మ చెప్పారు. జిల్లా ఎస్పీ విజయారావుతో కలసి ఆయన ఇటీవల నెల్లూరులో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి నిందితుల వివరాలు తెలిపారు.***

వాళ్ళంతా బంధువులే..అయినా ధనాశతో దొంగలుగా మారారు. అక్షరజ్ఞానం అంతంత మాత్రమే అయినా మాటువేసి దోపిడీలో చేయడంలో ఆరితేరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరుజిల్లాల్లో దోపిడీలకు పాల్పడ్డారు. వీరంతా కేవలం మద్యం దుకాణాల్లోనే చోరీలకు పాల్పడేవారు. అందుకు వారి ముఠా నాయకుడు మహేష్ ప్రకాశం జిల్లాలోని ఓ మద్యం దుకాణంలో క్యాషియర్‌గా పనిచేసిన అనుభవంతో ప్రభుత్వ మద్యం షాపుల్లో ఎలా చోరీచేయవచ్చో గమనించాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ధనాశతో దొంగతనాలు చేసేందుకు నిర్ణయించుకుని తనతోపాటు తమ బంధువుల్లో యువకులను కొంతమందిని కలుపుకుని మొత్తం 14 మందితో ముఠాను ఏర్పాటుచేశాడు. దొంగతనం చేసే దుకాణంలోనే వీరంతా మద్యం తాగుతూ అక్కడే ఉంటారు. అక్కడి వాచ్‌మెన్ పరిస్థితిని గమనిస్తూ ఏ అర్ధరాత్రో ఆ షాపుకు వచ్చి షట్టరు తొలగించి దోపిడీకి పాల్పడతారు. సోమవారం రోజున మద్యం షాపుల్లో డబ్బును బ్యాంకుల్లో జమచేస్తారని తెలుసుకుని శనివారం, లేదా ఆదివారం నాడే దుండగులు దుకాణాల్లో దోపిడీలకు పాల్పడతారు. దోపిడీ చేశాక సిసి కెమెరాలను కూడా ధ్వంసం చేస్తారు. వీరి దోపిడీలు ఇంతకాలం దాకా నెల్లూరు జిల్లాతో పాటు ప్రకాశం, కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విజయనగరం జిల్లాల్లో మొత్తం 45 చోరీలు చేశారు. కృష్ణా, విజయనగరం జిల్లాల్లో మద్యంషాపుల్లో దోపిడీలు చేసేటప్పుడు ఇద్దరు వాచ్‌మెన్‌లను కూడా దారుణంగా హతమార్చారు.

### ముదివర్తిపాళెం వద్ద చిక్కారు :

నెల్లూరుజిల్లాను కూడా వారు దోపిడీలకు ఎంచుకున్నారు. జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వరుసగా 9 చోట్ల దోపిడీలు చేశారు. వీరి ఆచూకీ కోసం పోలీసులు గాలించినా దొరకలేదు. ఇటీవల ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ మద్యం దుకాణంలో చోరీ జరగడంతో జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు, రాష్ట్రంలో అనేకచోట్ల ఇలా జరుగుతున్న చోరీల విషయంలో అప్రమత్తమై డిఐజి త్రివిక్రమవర్మ దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో డిఐజి పర్యవేక్షణలో, ఎస్పీ సారధ్యంలో జిల్లా పోలీసులు రంగంలోకి దిగారు. ఏఎస్పీ వెంకటరత్నం సూచనలతో నెల్లూరు సిసిఎస్ డిఎస్పీ శివాజీరాజు, నెల్లూరు రూరల్ డిఎస్పీ వై.హరినాధరెడ్డి, క్రైం బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్లు షేక్ బాజీజాన్ సైదా, జి.గంగాధర్, ఎస్‌ఐ సురేష్, ఏఎస్సై గిరిధర్‌రావుతో పాటు పోలీసులు జె.సురేష్‌బాబు, సిహెచ్ వెంకటేశ్వరరావు, జివి రమేష్, పి.సతీష్, ఆర్.హరీష్‌రెడ్డి, పివి సాయి ఆనంద్, షేక్ కరీముల్లా, టి.రాములు కలసి ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టారు. ఇటీవల ఇందుకూరుపేట మండలంలోని ముదివర్తిపాళెం మద్యం దుకాణం వద్ద ఉన్న ఏడుగురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు ఈ గజదొంగలను పట్టుకున్నారు. నిందితుల నుంచి 5 ద్విచక్రవాహనాలు, 5 సెల్‌ఫోన్లతో పాటు వారివద్ద ఉన్న 20,400 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా ప్రకాశం జిల్లా పిసి పల్లి మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన వారేనని పోలీసులు గుర్తించారు. నిందితుల్లో ప్రకాశం జిల్లా పిసి పల్లి మండలానికి చెందిన రాపూరు దుర్గారావు,, మేకల మహేంద్ర, మేకల అనిల్‌కుమార్, అల్లూరు సువర్తయ్య, రాపూరు మల్లికార్జున ఉన్నారని, వీరితో పాటు అరెస్టయిన వారిలో ఇద్దరు బాలనేరస్తులు కూడా ఉన్నారని డిఐజి తెలిపారు. మిగిలిన వారిని కూడా పట్టుకునేందుకు గాలింపు ముమ్మరం చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దోపిడీలకు పాల్పడుతున్న గజదొంగలను అరెస్ట్ చేసిన నెల్లూరుజిల్లా పోలీసులను డిఐజి, ఎస్పీలు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు.

### గాంధీజీపై విశిష్ట అధ్యయనం చేసి డాక్టరేట్ పొందిన

## డాక్టర్ ఏ.వి సుబ్బారాయుడు.. ఇక లేరు

- విఆర్‌సి ఆంగ్లవిభాగంలో తొలి పిహెచ్‌డి ఆయనదే



మహాత్మాగాంధీ నడిపిన భారత స్వాతంత్ర్యోద్యమం గురించి వచ్చిన ఎన్నో ఉద్గ్రంధాలను శోధించి, ఎంతో విశిష్టమైన రీతిలో సిద్ధాంత వ్యాసం రాసి డాక్టరేట్ సాధించిన విఆర్‌సి ఇంగ్లీష్ విభాగం విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ ఏవి సుబ్బారాయుడు..ఇక లేరు. 77ఏళ్ళ వృద్ధాప్యంలో అనారోగ్యానికి గురై ఇటీవల పరమపదించారు. ఆయనకు భర్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఉత్తమ అధ్యాపకునిగా, ఎందరో విద్యార్థులను ఉన్నతస్థాయిలో తీర్చిదిద్దిన అయ్యవారిగా ఆయనకెంతో పేరుంది. ఆయన మృతితో విఆర్ కళాశాల అధ్యాపకులే కాక, ఆయన శిష్యబృందమంతా శోకతప్తమైంది.

1944 అక్టోబర్ 27న నెల్లూరులో జన్మించిన ఆయన విద్యాభ్యాసం ఆర్‌ఎస్‌ఆర్, విఆర్ కళాశాలల్లో జరిగింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఉన్న విక్రమ్ యూనివర్సిటీ నుంచి 1967లో ఇంగ్లీషులో ఎం.ఏ డిగ్రీని పొంది, అదే ఏడాది ఆగస్టులో నెల్లూరుకు వచ్చి విఆర్ కళాశాల ఇంగ్లీష్ విభాగంలో ట్యూటర్‌గా చేరారు. 1977లో అధ్యాపకునిగా పదోన్నతి పొందారు. సుబ్బారాయుడు తన అధ్యాపక వృత్తి పట్ల ఎంతో నిబద్ధతతో ఉండేవారు. కొంతకాలం పాటు అధ్యాపక సంఘం (ఆక్టా) విఆర్‌కాలేజీ అధ్యక్షునిగా కూడా వ్యవహరించారు. అక్టోబర్ 2022లో రీడర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. దాదాపు 35 ఏళ్ళ పాటు విఆర్‌సిలో ఇంగ్లీషు అధ్యాపకునిగా ఉంటూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఉత్తమ గురువు ఆయన.

### మహాత్మాగాంధీపై పరిశోధనకు పిహెచ్‌డి

ఆయన సర్వీసులో అత్యంత ప్రధానమైన అంశం డాక్టరేట్ పొందడం. అందులోనూ మహాత్మాగాంధీ జీవితంలోని ప్రధాన ఘట్టాలపై రాసిన గ్రంథాలను పరిశీలించి సిద్ధాంత వ్యాసం సమర్పించడం విశేషం. గాంధీమహాత్ముని సారధ్యంలో జరిగిన భారత స్వాతంత్ర్య సంగ్రామంలోని నాలుగు ప్రధాన ఘట్టాలైన ఉప్పు సత్యాగ్రహం, స్వరాజ్య ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం, దేశ విభజనకు సంబంధించి ప్రఖ్యాత ఆంగ్ల రచయిత చమన్‌లాల్ నహల్ 'ది గాంధీ క్వార్టెట్' అనే గ్రంథాల సంకలనాన్ని 1993లో ప్రచురించగా సుబ్బరాయుడు ఆ సంకలనంపై పరిశోధన జరిపారు. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంగ్లీషు ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి పర్యవేక్షణలో 1996లో పిహెచ్‌డి పట్టా పొందారు కూడా. ఈ పరిశోధనకు విఆర్‌సి ఇంగ్లీషు విభాగంలో గురువుగా ఉన్న ప్రముఖ విద్యావేత్త వివిఎస్ రామచంద్రరావుతో పాటు, స్వర్గీయ టిబి రామమూర్తి, వేదం వేంకటరామన్, సి.సీతాపతిరావు ఎంతగానో సహకరించి ప్రోత్సహించారు. ఆ సిద్ధాంత వ్యాసాన్ని 2000వ సంవత్సరంలో కొత్త ఢిల్లీలోని ప్రెస్టేజ్ బుక్స్ సంస్థ వారు పుస్తకంగా ప్రచురించారు. ఈ పరిశోధనాత్మక గ్రంథం ఎంతోమంది మేధావుల ప్రశంసలందుకోవడం ఆయన ప్రతిభాపాటవాలకు నిదర్శనం. అంతేకాదు, విఆర్‌కాలేజీ ఇంగ్లీషు విభాగంలో డాక్టరేట్ పొందిన ఏకైక అధ్యాపకుడు కూడా ఏవి సుబ్బరాయుడే కావడం మరో విశేషం.

### సహృదయుడు.. స్నేహశీలి :

డా. సుబ్బరాయుడు ఎంతో సహృదయుడు, స్నేహశీలి. పుస్తకాలు చదవడంలో ఆయనకున్న ఆసక్తి అపారం. ఆయనకు ఇద్దరూ కుమార్తెలే కావడంతో చిన్నకుమార్తె అంతిమ సంస్కారాలు నిర్వహించి తండ్రి రుణం తీర్చుకుంది. ఆయన మృతికి విఆర్ కాలేజీ విశ్రాంత అధ్యాపకులు, ఏవి సుబ్బారాయుడి గురువైన వివిఎస్ రామచంద్రరావు విచారం వ్యక్తంచేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించారు. అదేవిధంగా ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ సివి సుబ్రహ్మణ్యం, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నేలభొట్ల సుందరబాబు, విఆర్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ పి.మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ జివి రమణమూర్తి, అమరా వెంకటే శ్వరరావు, వెన్నెలగంటి ప్రసాద్, ఎం.కృష్ణకుమార్, కిరణ్ మయూర్, పి.సాయినారాయణ, నబీసాహెబ్, బి.సత్యమురళీధర్, కె.వీరారెడ్డి, దూరదర్శన్ విశ్రాంత అడిషనల్ డైరక్టర్ జనరల్ డాక్టర్ రేవూరు అనంత పద్మనాభరావు, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ తొలి వైస్‌ఛాన్సలర్ ప్రొ॥ సి. విశ్వేశ్వరరావు తదితరులు సుబ్బరాయుడు మృతికి నివాళులర్పించారు.

### అంతర్జాతీయ క్రికెట్‌లో.. నెల్లూరు కుర్రోడు

# అశ్విన్ హెబ్బార్



**ఆ** కుర్రోడికి చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ప్రాణం. ప్రతిరోజూ వేకువన 3 గంటలకే లేచి, నాలుగో గంటకల్లా ఆటస్థలంలో బ్యాట్ పట్టుకుని నిలబడేవాడు. క్రికెట్‌లో ఎన్నో మెళకువలు నేర్చుకున్నాడు. ఎంతో పట్టుదలతో, క్రమశిక్షణతో, నిరంతర దీక్షతో..కఠోర పరిశ్రమతో అపూర్వమైన క్రీడా ప్రతిభను ప్రదర్శించేవాడు. ఆ శ్రద్ధాసక్తులే ఆయన్ను విజయపథంవైపు నడిపించి అంతర్జాతీయస్థాయిలో నిలబెట్టాయి. అందుకే ఇప్పుడా యువకుడి పేరు క్రికెట్ క్రీడారంగంలో ఒక సంచలనంగా మారింది. ఆ యువ క్రికెట్ ఆటగాడు మరెవరో కాదు.. మన నెల్లూరీయుడైన అశ్విన్ హెబ్బార్. నెల్లూరులో గోమతి స్కూల్‌లో చదువుకున్న పిల్లోడు. ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ రంగంలోనే సంచలనం సృష్టిస్తున్నాడు. నెల్లూరు గ్రౌండ్స్‌లో క్రికెట్ నేర్చుకున్న చిన్నోడు.. ఇప్పుడు ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన ఐపిఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్)కు ఎంపికయ్యాడు. ఐపిఎల్ వేలం ప్రక్రియకు 599 మంది పేర్లను సిద్ధం చేస్తే.. అందులో ఆ అబ్బాయి 57వ స్థానంలో నిలవడం, ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 20 లక్షలకు అశ్విన్‌ను సొంతం చేసుకోవడం అశ్విన్ క్రీడా ప్రతిభకు నిదర్శనం.

అశ్విన్ పుట్టింది పెరిగింది.. చదువుకుంది.. క్రికెట్ క్రీడాకారునిగా ఎదిగింది.. అంతా నెల్లూరులోనే. అశ్విన్ తల్లిదండ్రులు రాజ్‌గిరి హెబ్బార్ - అశ్విన్ హెబ్బార్ కాగా, సోదరుడు అకాశ్ హెబ్బార్.

అశ్విన్ హెబ్బార్ 1995 నవంబరు 15న జన్మించాడు. తొలినుంచి అశ్విన్‌కు క్రికెట్ పట్ల అపారమైన ఆసక్తి ఉండడాన్ని గమనించి తల్లితండ్రులు మరింతగా ప్రోత్సహించారు. తండ్రే తొలి గురువుగా అశ్విన్‌ను బ్యాట్ పట్టుకుని నడిపించారు. అశ్విన్ నెల్లూరులోని గోమతిస్కూల్‌లో నాల్గవతరగతి చదువుతున్నప్పుడే క్రికెట్‌పై చూపుతున్న శ్రద్ధను చూసి నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో చేర్పించారు. అశ్విన్ క్రీడానైపుణ్యాన్ని గుర్తించిన జిల్లా క్రికెట్ అసోసియేషన్ వారు క్రికెట్‌లో మరిన్ని మెలకువలు నేర్పించి మంచి ఆటగాడిగా తీర్చిదిద్దారు. క్రికెట్టే ప్రాణంగా ఎదిగిన అశ్విన్ ఆంధ్రజట్టులో ఆణిముత్యంగా నిలిచి జాతీయస్థాయిలోనూ రాణించాడు.

## ఎన్నో ఘనవిజయాలు :

2007లో మొట్టమొదటిసారిగా అండర్-13 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన అశ్విన్.. ఆ తర్వాత నుంచి ఇక తిరిగి చూడలేదు. రాష్ట్ర జాతీయస్థాయిల్లో జరిగిన అనేక క్రికెట్ పోటీల్లో ఎన్నో విజయాలు సాధించి తన సత్తా నిరూపించుకున్నాడు. సరిగ్గా ఏడాది కిందట కూడా.. 2021 ఫిబ్రవరి22న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన విజయ హజారే క్రికెట్ ట్రోఫీలో తమిళనాడు-ఆంధ్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రజట్టులో ఉన్న అశ్విన్ సెంచరీ చేసి నాటౌట్‌గా నిలవడమే కాక ఆంధ్రజట్టుకు అద్భుత విజయం చేకూర్చి అందరి అభినందనలు అందుకున్నాడు కూడా. 84 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 101 పరుగులు చేసి తన సత్తా నిరూపించుకున్నాడు. క్రికెట్‌లో ఆంధ్ర జట్టుకు విజయాల సారథిగా ఉంటూ 'ఫస్ట్‌క్లాస్ ఇండియన్ క్రికెటర్'గా పేరెన్నికగన్నాడు. అందుకే అశ్విన్ ప్రతిభను చూసి బెంగుళూరులో ఇటీవల జరిగిన ఐపిఎల్ వేలం ప్రక్రియలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అశ్విన్ హెబ్బార్‌ను 20 లక్షలకు సొంతం చేసుకోవడం విశేషం.

## ఐపిఎల్ ఎంపిక అంటే.. ఆషామాషీ కాదు :

టాటా ఐపిఎల్ ఎంపిక అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. మహా గొప్ప ఆటగాళ్లమని అనుకునేవాళ్లకే అదొక కల. దానిని సాకారం చేసుకోవడం అందరికీ అలివయ్యే పనికాదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) అంటే ఒక్క భారత క్రికెట్ లోనే కాదు ప్రపంచ క్రీడారంగ చరిత్రలోనే ఒక సంచలనం. క్రికెట్ క్రీడాకారులందరూ ఐపిఎల్‌లో చోటు దక్కించుకునేందుకు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తుంటారు. అయితే అత్యంత ప్రతిభాసామర్థ్యం ఉన్నవారినే ఐపిఎల్‌లో ఎంపిక చేస్తారు. ఆ ఎంపికలో నిలవడం అపారమైన ప్రతిభ, అపూర్వమైన క్రీడా నైపుణ్యం ఉన్న ఆటగాళ్ళకే సాధ్యం. అసలు ఐపిఎల్ ఎంపిక అంటేనే లెక్కనేనన్ని నిబంధనలు.. చెప్పలేనన్ని వడపోతలు. ఎంతో కసరత్తు జరిగాకే ఐపిఎల్‌లో పేరు పరిశీలనకు వస్తుంది. అశ్విన్ హెబ్బార్ అంతటి ఘనతను దక్కించుకోవడం నెల్లూరుకే గర్వకారణం. చిన్నతనం నుంచి ఏళ్ళ తరబడిగా పడిన కష్టం, చేసిన పరి శ్రమ ఫలించింది. తొలిసారిగా నెల్లూరీ యుడికి ఐపిఎల్‌లో మంచి అవకాశం లభించింది. అందుకోసం ఇటీవల బెంగుళూరులో జరిగిన ఐపిఎల్ వేలం ప్రక్రియలో ప్రపంచవ్యాప్తంగా 1300 మంది మెరికల్లాంటి క్రీడాకారుల జాబితాను రూపొందించగా, అన్ని వడపోతలు జరిగి చివరికి 599 మంది పేర్లను ఖరారు చేశారు. అందులో అశ్విన్ హెబ్బార్ పేరు 57వ స్థానంలో నిలిచిందంటే అశ్విన్ క్రీడా నైపుణ్యం ఎంతటి ఘనమైనదో తెలుస్తుంది. మార్చి 26 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. ఆ పోటీల్లో అశ్విన్ మరింత ప్రతిభతో రాణించి నెల్లూరు పేరును అంతర్జాతీయస్థాయిలో గొప్పగా చాటాలని అందరూ ఆశిస్తున్నారు. గుడ్‌లక్.. అశ్విన్!.



## ప్రతిభనే నమ్ముకున్నాడు.. స్వయంకృషితో ఎదిగాడు

**- తండ్రి రాజ్‌గిరి హెబ్బార్**

ఎనిమిదేళ్ల వయసునుంచే అశ్విన్ క్రికెట్ బాగా నేర్చుకోవాలనే పట్టుదలతో ఉండేవాడు. అందుకోసం ఎంతగానో కష్టపడేవాడు కూడా. చిన్నవయసులోనే అశ్విన్ క్రికెట్ బ్యాట్ పట్టుకుని బంతిని పరుగులు తీయించడం చూసి ఎంతో ముచ్చటేసేది. నేను మద్రాసులో చదువుకునే రోజుల్లో క్రికెట్ కెప్టెన్‌గా ఉండేవాణ్ని. అశ్విన్ ఆసక్తిని చూసి పలు చోట్ల జరిగే క్రికెట్ సమ్మర్‌క్యాంప్‌లకు నేను తీసుకువెళ్ళేవాణ్ని. కఠోరశ్రమ, క్రమశిక్షణతో క్రికెట్‌లో అద్భుతమైన పట్టు సాధించాడు అశ్విన్. 11వ ఏటనే జిల్లా స్థాయిలో మంచి ఆటగాడిగా రాణిస్తూ 12ఏళ్ళ వయసు నుంచే రాష్ట్రస్థాయి క్రీడాకారుడిగా ఎదిగాడు. ఆ తర్వాత నుంచి జాతీయస్థాయిలోనూ ఎన్నో క్రికెట్ పోటీల్లో విజయుడిగా, అజేయుడిగా కూడా నిలిచాడు. అఖిలభారత స్థాయిలో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ క్రికెట్ ట్రోఫీలో ఉత్తమ ప్రతిభతో రాణించి 4వ స్థానం సంపాదించాడు. తొలినుంచి అశ్విన్‌కు కొన్ని ఖచ్చితమైన నిశ్చితాభిప్రాయాలున్నాయి. ఎంత కష్టపడైనా సరే స్వయంగా ఎదగాలని కోరుకుంటాడే గానీ ఎవరితోనైనా రికమెండ్ చేయించుకోవాలని ఎప్పుడూ కోరుకోడు. ప్రతిభనే నమ్ముకున్నాడు. స్వయంకృషితోనే ఎదిగాడు. తాను కన్న కలలను కష్టపడి సాకారం చేసుకుంటున్నాడు. ఆ పట్టుదలే అశ్విన్‌ను జాతీయస్థాయిలోనే కాక, ఇప్పుడు అంతర్జాతీయస్థాయిలోనూ నిలబెట్టింది. ఐపిఎల్‌లో ఎంపిక కావడం క్రికెట్ క్రీడారంగంలో ఒక అరుదైన అద్భుతమైన అవకాశం. అలాంటి ఘనత సాధించిన అశ్విన్.. భవిష్యత్తులో మరెన్నో ఘనవిజయాలు సాధిస్తాడనే నమ్మకం మాకుంది.



### రాపూరు మాజీ ఎమ్మెల్యే..

# ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి కన్నుమూత

***సీ**నియర్ రాజకీయ నాయకుడు, ప్రజానేతగా పేరుగాంచిన నాటి రాపూరు మాజీ ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి తన 82వ ఏట అస్వస్థతతో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఈనెల14న మృతిచెందారు. ఆయన మరణంతో జిల్లా ఒక మంచి రాజకీయ వేత్తను కోల్పోయినట్లయింది. ఇటీవలే నెల్లూరు మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి అస్తమించడం, ఇప్పుడు ఎల్లసిరి నిష్క్రమించడంతో జిల్లా రాజకీయరంగంలో విషాదం అలముకుంది.*

జిల్లాలోనే కాదు రాష్ట్ర రాజకీయ రంగంలో కూడా ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి మంచిపేరు తెచ్చుకున్నారు. నెమ్మదస్తుడు, అజాతశత్రువు కూడా. ప్రత్యేకించి గూడూరు, రాపూరు ప్రాంతాల్లో ఆయనకు ఎంతోమంది అభిమానులున్నారు. ఎమ్మెల్యేగా, నాయకునిగా ఆయన సుదీర్ఘకాలం ఆ ప్రాంతాల ప్రజలకు విశేష సేవలందించారు. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుండేవారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన బాటలు వేశారు.

గూడూరు మండలంలోని చెన్నూరు గ్రామం ఎల్లసిరి స్వస్థలం. విద్యార్థి దశ నుంచే ఆయనకు రాజకీయాలపై మక్కువ ఎక్కువ. ప్రజలతో ఎప్పుడూ కలసిమెలసి ఉండేవారు. అదే ఆయన్ను ప్రజాసేవా రంగానికి మరింత దగ్గరచేసింది. 1981లో గూడూరు సమితి అధ్యక్షునిగా ఆయన బాధ్యతలు నిర్వహించారు. 1983లో తెలుగుదేశం పార్టీలో చేరి జిల్లా రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. 1984-85లో జిల్లా పరిషత్ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1986-87లో టిడిపి జిల్లా అధ్యక్షునిగా ఉన్నారు. 1994 ఎన్నికల్లో రాపూరు నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీచేసి అప్పటికే మాజీ మంత్రిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిపై విజయం సాధించారు. రాపూరు ఎమ్మెల్యేగా అనేక అభివృద్ధి పనులు చేసి ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నారు. దాదాపు పదేళ్ళపాటు రాపూరు నియోజకవర్గంలో టిడిపి నాయకునిగా ఆయన రాణించారు. 1999, 2004 ఎన్నికల్లో టిడిపి తరపున పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సూచనలతో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఆయన అనారోగ్యంతో రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

## మంచి నాయకుడు ఎల్లసిరి

**- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

రాపూరు మాజీ ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి పరమపదించారని తెలిసి భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆయన కుటుంబానికి తన సంతాపం తెలియజేశారు. ఈ నెల 16న ఎల్లసిరి కుమారుడు సుధీర్‌రెడ్డిని ఫోన్ ద్వారా ఆయన పరామర్శించారు. ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి మంచి నాయకులని.. పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని, తన పట్ల ఎంతో అభిమానంతో ఉండే వారని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి గుర్తు చేసుకున్నారు.

## పదవులకే వన్నె తెచ్చారు **- ఆదాల**

రాపూరు మాజీ ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి మృతికి విచారం వ్యక్తం చేస్తూ నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సంతాపాన్ని తెలియజేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసిన వ్యక్తి ఎల్లసిరి అని కొనియాడారు. గూడూరు సమితి అధ్యక్షులుగా, నెల్లూరుజిల్లా పరిషత్ చైర్మన్‌గా.. ఇలా ఏ పదవిలోఉన్నా అందరికీ అందుబాటులో ఉంటూ ఆ పదవులకు ఆయన వన్నెతెచ్చారని ప్రశంసించారు. విజయ డెయిరీ ఛైర్మెన్ రంగారెడ్డి తదితరులు కూడా ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి మృతికి విచారిస్తూ ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర **- సోమిరెడ్డి**

రాపూరు మాజీ ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి మృతి విచారకరమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఎల్లసిరి సుదీర్ఘకాలం పాటు అందించిన సేవలు అపూర్వమని ఆయన వివరించారు. వైఎస్సార్సీపి సిఇసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జెకె రెడ్డి, పాశం సునీల్‌కుమార్, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్‌తో పాటు పార్టీలకు అతీతంగా అనేకమంది ప్రముఖులు, పెద్దసంఖ్యలో ప్రజలు చెన్నూరులో ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# పెంచలకోనలో అన్నదానానికి.. 2 లక్షల విరాళం

పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు 2 లక్షల రూపాయల విరాళమిచ్చారు. పొదలకూరు మండలంలోని ఆల్తుర్తి గ్రామానికి చెందిన చిల్లకూరు రామ్మోహన్‌రెడ్డి ఆయన కుటుంబసభ్యులతో ఈనెల 16న పెంచలకోన దేవాలయానికి వచ్చి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు రెండు లక్షలా రెండువేలా రెండువందల పదహారు రూపాయల విరాళం చెక్కును అందజేసి తమ వితరణ చాటుకున్నారు. ప్రధాన అర్చకుడు సీతారామయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వెంకటగిరిపై పునరాలోచన చేయండి

## - ఆనం రామనారాయణరెడ్డి విజ్ఞప్తి

రాష్ట్రంలోని 13 జిల్లాలను పునర్విభజించి 26 జిల్లాలు చేయాలన్న ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే వెంకటగిరి నియోజకవర్గాన్ని బాలాజీ జిల్లాలో కలపడం వల్ల కొన్ని ఇబ్బందులున్నాయి కనుక వెంకటగిరి విషయంపై పునరాలోచన చేయాలని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కోరారు. ఈనెల 16న ఆయన పలువురు వెంకటగిరి నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో నెల్లూరులో కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబును కలిసి జిల్లా పునర్విభజన ప్రక్రియలో తమ అభ్యంతరాలను వినతి పత్రం ద్వారా వివరించారు. వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని, ఆ మేరకు మండలాల్లో ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతున్నామని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనలో కూడా మూడు మండలాలకు నష్టం జరిగిందని, సోమశిల ప్రాజెక్టు కూడా నాగార్జున సాగర్‌లా వివాదాస్పదం అయ్యే ప్రమాదం ఉందని, ప్రజల ఆవేదనను అర్థం చేసుకుని న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. రాజకీయస్వార్థంతో గతంలో నియోజకవర్గాల పునర్విభజన చేశారని, ఆనం కుటుంబాన్ని దెబ్బకొట్టేందుకే అప్పుడలా చేశారని ఆయన ఈ సందర్భంగా అంటూ జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. జిల్లాలోని ఎమ్మెల్యేలతో ప్రజా ప్రతినిధులతో పునర్విభజనపై చర్చించలేదని, అధికారులు వాళ్ళకు వాళ్ళే నిర్ణయాలు తీసుకున్నారని, ప్రజల మనోభావాలను పరిగణించలేదని ఆయన పేర్కొన్నారు. అధికారులు పునరాలోచించి సహేతుకమైన నిర్ణయం తీసుకోవాలని, కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల పరిధిని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోనే పాత రెవెన్యూ డివిజన్లలోనే, ప్రస్తుతం ఉన్నట్లుగానే యథాతథస్థితిలో కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

# కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న ఔదార్యం

## ---- బాలిక వైద్యం కోసం 50వేల విరాళం ----

కోవూరుకు చెందిన స్వీటీ అనే బాలిక ఇటీవల డెంగ్యూ జ్వరంతో ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరి ఇబ్బందిపడుతూ నెల్లూరులోని రామచంద్రారెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆ బాలిక వైద్యచికిత్సల కోసం 50వేల రూపాయల విరాళం అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆ విరాళాన్ని ఇవ్వగా జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ దొద్దంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి చేతుల మీదుగా ఇటీవల ఆ బాలిక కుటుంబసభ్యులకు ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ దేవస్థానం మాజీ ఛైర్మెన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, బాలికల పాఠశాల హెడ్మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

# గ్రంథాలయాలకు మంచిరోజులొచ్చాయి

- కొత్త పుస్తకాలతో కళకళలాడనున్న లైబ్రరీలు
- కోటి రూపాయలిచ్చిన ప్రభుత్వం



పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద, కమిటీ సభ్యులు

ఎట్టకేలకు జిల్లాలోని గ్రంథాలయాలకు చాలా కాలం తర్వాత మంచి రోజులు వచ్చాయి. ఇంతకాలంగా కొత్త పుస్తకాలు రాక గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థులు, పాఠకుల సంఖ్య క్రమేణా తగ్గిపోతున్న నేపథ్యంలో విజ్ఞాన సముపార్జనకు ఎంతగానో దోహదం చేసే సరస్వతీ నిలయాలైన గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలు కొనుగోలు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరుచేయడం ఎంతైనా హర్షదాయకం. దీంతో జిల్లాలోని లైబ్రరీలకు అవసరమైన పుస్తకాలు సమకూర్చేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద ఆధ్వర్యంలో ఈనెల 14న పుస్తకాల కొనుగోలుకు ఎంపిక కోసం ఏర్పాటుచేసిన కమిటీ సమావేశమైంది. నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన ఈ సమావేశంలో పుస్తక ప్రచురణ సంస్థల నుంచి రచయితల నుంచి వచ్చిన పలు పుస్తకాలను ఈ సందర్భంగా పరిశీలించారు. అందరికీ ఉపయోగపడే పుస్తకాలతో పాటు ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఛైర్మెన్ శారద చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను అభివృద్ధి చేయడంతో పాటు, అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరమైన పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సిహెచ్ ప్రసాద్. పుస్తక కమిటీ సభ్యులు డా. కె.కరుణశ్రీ, కె.జోజి, డా. జి.సురేంద్ర, డా. ఎన్.అనితతో పాటు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్గో సేవలు పెంచాలి

## - ఆర్టీసి ఇ.డి గోపీనాథ్‌రెడ్డి

ఆర్టీసి నెల్లూరు రీజియన్ పరిధిలో కార్గో సేవలు పెంచాలని, అందుకు అందరూ కృషిచేయాలని ఆర్టీసి జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి చెప్పారు. ఈనెల 15న ఆయన నెల్లూరులోని ప్రధాన ఆర్టీసి బస్టాండు ప్రాంగణంలో ఉన్న ఆర్టీసి కార్గో కార్యాలయం వద్ద ఉద్యోగులు, కార్మికులతో మాట్లాడారు. కార్గో సేవలను ప్రజలందరికీ చేరువ చేసేందుకు ఆర్టీసి సంసిద్ధంగా ఉందని, తద్వారా ఆర్టీసి ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.




# ఎన్‌బికెఆర్‌లో 20న రక్తదానం

## నేదురుమల్లి జయంతి రోజున సేవా కార్యక్రమం



మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 87వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 20న విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో రక్తదానం నిర్వహిస్తామని ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోజు ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఫౌండేషన్ ఛైర్మెన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రతిఏటా నేదురుమల్లి జయంతిని నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా రక్తదానం కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. గతంలో వరుసగా 2018, 2019, 2020 సంవత్సరాల్లో అత్యధిక రక్త యూనిట్లు సేకరించి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచినందుకు నేదురుమల్లి ఫౌండేషన్ రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా రాజ్‌భవన్‌లో అవార్డులను కూడా పొందిందని ఆయన గుర్తుచేశారు. రక్తదాన కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ విద్యార్థులు, బోధన బోధనేతర సిబ్బందితో పాటు నేదురుమల్లి బంధువులు, అభిమానులు కూడా పాల్గొంటారని తెలిపారు. రక్తదానం చేసేరోజున నెల్లూరు నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ, డిఎస్‌ఆర్ ఆసుపత్రి, గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్‌ల సిబ్బంది వచ్చి దాతల నుంచి రక్తాన్ని సేకరిస్తారని ఆయన వివరించారు. నేదురుమల్లి జయంతి సందర్భంగా రక్తదానంతో పాటు గతంలో వాకాడు, విద్యానగర్‌లలో ప్రజలకు పరిశుద్ధమైన తాగునీరు అందించడానికి ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్‌లను, వెంకటగిరిలో వాటర్‌ట్యాంకర్స్‌ని ఏర్పాటుచేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇవేకాక ప్రతిఏటా ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల్లో చదువుకునే ప్రతిభ కలిగిన విద్యార్థులకు వారు కళాశాలకు చెల్లించాల్సిన ఫీజులో కొంతభాగాన్ని నేదురుమల్లి ఫౌండేషన్ చెల్లించి ఆ విద్యార్థులకు తనవంతు సాయం అందిస్తోందన్నారు.

# శ్రీసిటీలో ల్యాండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం




అంతర్జాతీయస్థాయిలో ప్రముఖ పారిశ్రామికవాడగా పేరొందిన శ్రీసిటీలో ఈనెల 14న ల్యాండ్ రిజిస్ట్రేషన్ నూతన కార్యాలయం (ఇటినెరేటింగ్ సెంటర్) ప్రారంభమైంది. స్థానిక సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయ భవనం రెండవ అంతస్తులో ఏర్పాటైన ఈ కార్యాలయాన్ని చిత్తూరుజిల్లా రిజిస్ట్రార్ పివిఎన్ బాబు ప్రారంభించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, సత్యవేడు సబ్ రిజిస్ట్రార్ కోమలదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రిజిస్ట్రార్ బాబు మాట్లాడుతూ, పరిశ్రమలకు త్వరితగతిన అన్ని అనుమతులు ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానంలో భాగంగా ప్రముఖ పారిశ్రామిక నగరం శ్రీసిటీలో ఈ ప్రత్యేక రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. దీని ద్వారా ఇక్కడ పారిశ్రామిక కార్యకలాపాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా, సులభతరంగా జరుగుతుందని పేర్కొన్నారు. సత్యవేడు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి అనుబంధంగా ఇది పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం వారంలో ఒక్కరోజు మంగళవారం మాత్రం ఇక్కడ రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తారని, ప్రాధాన్యతను బట్టి భవిష్యత్తులో సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ తరహా ప్రత్యేక రిజిస్ట్రార్ కార్యాలయం ఒక్క శ్రీసిటీలో మాత్రమే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శ్రీసిటీలో నూతన ల్యాండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటుపై శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. దీని ద్వారా పరిశ్రమ వర్గాలకు ఎంతో సౌలభ్యం కలుగుతుందన్నారు. శ్రీసిటీ ప్రాధాన్యతను గుర్తించి ప్రత్యేక రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేసినందుకు రాష్ట్రప్రభుత్వానికి, రిజిస్ట్రేషన్ శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# శ్రద్ధాంజలి



16.02.1933 - 23.02.2021

ఆదర్శమూర్తి, ఆత్మీయదీప్తి, మా కుటుంబ కీర్తి

**కీ॥శే॥ గునుపాటి హరిశ్చంద్రారెడ్డి గారు**

పరమపదించి ఫిబ్రవరి 23, 2022 నాటికి ఏడాది గడుస్తుంది.

వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ

శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం.

**గునుపాటి శ్యామల** - భార్య

**గునుపాటి పార్వతి** - కుమార్తె

**గునుపాటి వెంకటేశ్వరప్రసాద్** - కుమారుడు

**గునుపాటి అనూరాధ** - కోడలు

మనుమళ్ళు, మనుమరాళ్ళు

**దామోదర్ - ఇందిర - సంజన - మల్లిక - శరత్**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com